నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 30-1-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:136 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

మాటల మంట
రసతెచ్చె తంట
బుద్ధికి గంట

తొక్కిస లాట
భక్తుల ముక్తి బాట
వైకుంఠ పాళి

మళ్ళి మాస్కులు
శుభ్రత లేపనాలు
వైరస్ తోభద్రం

పసుపు బోర్డు
రైతుల వెలుగు బాట
తెలుగు నాట

నిశబ్ద దాడి
మొరగని కుక్కలు
నమ్మక ద్రోహం

- రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజం

మహిళల టీటొంటీ లో
భారత జట్టు విజయం !
ప్రపంచ కప్ క్రికెట్టులో
స్కాట్లాండ్ జట్టు అపజయం !
టోర్నీ చరిత్రలోనే
సెంచరీ చేసె త్రిశ !
నూటాపది రన్నులతో
నాటౌట్ తమాషా ?

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

ఎపి, తెలంగాణలలో ఎన్నికల నగరా.. ఆరు స్థానాలకు షెడ్యూల్ విడుదల

-ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
-ఎపి, తెలంగాణలో ఆరు స్థానాలకు ఎన్నికలు
-నాలుగు ఉపాధ్యాయ, రెండు పట్టభద్రుల స్థానాలకు ఎలక్షన్
-నేటి నుంచే ఎన్నికల కోడ్ అమలు
-ఫిబ్రవరి మూడో తేదిన నోటిపికేషన్
-ఫిబ్రవరి 27న పోలింగ్ .. మార్చి మూడు ఓట్ల లెక్కింపు

హైదరాబాద్, జనవరి 29: ఎపి, తెలంగాణలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. కాగా ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను వెల్లడించనున్నారు.

నేటి నుంచే ఎన్నికల కోడ్ ..

తెలంగాణ, ఎపిలోని నాలుగు ఉపాధ్యాయ, రెండు పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణాలో వరంగల్ -ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ స్థానానికి, మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ ఉపాధ్యాయ స్థానానికి, మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు

ఇది ఇలా ఉంటే మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ గ్రాడ్యుయేట్ స్థానం నుంచి ప్రస్తుతం జీవన్ రెడ్డి(కాంగ్రెస్) , మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ టీచర్ స్థానం నుంచి కూర రఘోత్తం రెడ్డి, వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ స్థానం నుంచి అలుగుబెల్లి నర్సి రెడ్డి కొనసాగుతున్నారు. ఈ ముగ్గురి పదవీకాలం మార్చి 29వ తేదీతో ముగియనుంది. దీంతో ఈ మూడు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు..

ఎపిలో

అటు ఏపీలో ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజక వర్గానికి ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

నోటిఫికేషన్ విడుదల - ఫిబ్రవరి 3

నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ - ఫిబ్రవరి 10

నామినేషన్ల పరిశీలన - ఫిబ్రవరి 11

నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ- ఫిబ్రవరి 13

పోలింగ్ - ఫిబ్రవరి 27(ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు)

ఓట్ల లెక్కింపు ?- మార్చి 3

కుంభమేళాలో తొక్కిసలాట

14 మంది మృతి.. సీఎం యోగితో 3 సార్లు మాట్లాడిన మోదీ

-ఎపి, తెలంగాణ సిఎంల విచారం

హైదరాబాద్, జనవరి 29: కుంభమేళాలో అపశృతి చోటుచేసుకున్నది. మౌనా అమావాస్య సందర్భంగా అమృత స్నానంలో పాల్గొనేందుకు లక్షల సంఖ్యలో భక్తులు త్రివేణి సంగమంకు చేరుకున్నారు. అయితే ఇవాళ తెల్లవారుజామున 3 గంటల సమయంలో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఆ తొక్కిసలాటలో 14 మంది మృతిచెందారు. మరో 50 మందికి పైగా గాయపడినట్లు తెలుస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని స్వరూపరాణి ఆస్పత్రికి మృతదేహాలను తరలించారు. అక్కడ పోస్టు మార్టం నిర్వహించనున్నారు.

మహాకుంభ్ పరిస్థితిపై ప్రధాని మోదీ.. యూపీ సీఎం యోగితో ఇవాళ మాట్లాడారు. ఇప్పటికే మూడు సార్లు మాట్లాడిన అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. కుంభమేళా పరిస్థితి పై ప్రధాని మోదీ సమీక్షిస్తూనే ఉన్నారు. తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ప్రధాని ఆదేశించారు. యూపీ ప్రభుత్వ అధికారులతో ఆయన టచ్‌లోనే ఉన్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చేపట్టాల్సిన చర్యల్ని ఆయన సూచిస్తున్నారు.

తొక్కిసలాట వల్ల 13 అకాడాలు అమృత స్నానం రద్దు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వాళ్లు ప్రకటన జారీ చేశారు. అయితే ఇవాళ ఉదయం 10 గంటల తర్వాత అకాడాలు అమృత స్నానానికి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కూడా యూపీ సీఎంతో పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

త్రివేణి సంగమంలో తొక్కిసలాట జరిగిన ప్రదేశానికి ఉదయం సుమారు 70 అంబులెన్సులు చేరుకున్నాయి. దాదాపు మూడు గంటల పాటు తరలింపు ప్రక్రియ జరిగింది. అమావాస్య రోజున స్నానం చేయాలన్న ఉద్దేశంతో.. కోట్ల సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు. అధికారులు అంచనా ప్రకారం.. ఇప్పటికే 5 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్ పరిసరాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు సాయంత్రం వరకు ఆ సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి.

మహాకుంభమేళాలో జరిగిన తొక్కినలాట ఘటనపై ఎపి, తెలంగాణ ముఖ్యమంత్రులు, డిప్యూటీ ముఖ్యమంత్రులు విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో ప్రాణాల కోల్పోయిన వారికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు , తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎక్స్ వేదికగా సీఎం స్పందిస్తూ మహాకుంభమేళా తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ఈ క్లిష్ట సమయంలో మనోధైర్యం కోల్పోకుండా వారికి ఓదార్పు కల్పించాలని కోరుకుంటున్నాను అంటూ ఎక్స్ వేదికగా చంద్రబాబు పోస్టు చేశారు.

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆ కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఆదుకోవాలని, గాయపడినవారికి సరైన వైద్యం అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క్ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

మహా కుంభమేళాలో తొక్కిసలాట దురదృష్టకరం - పవన్ కల్యాణ్

ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో 20 మంది భక్తులు దుర్మరణం పాలయ్యారని తెలిసి ఆవేదనకు లోనయ్యానని తెలిపారు ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ . దురదృష్టకరమైన ఘటన ఇది. మౌని అమావాస్య సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించాలని కోట్ల మంది వచ్చిన క్రమంలో తొక్కిసలాట చోటు చేసుకోవడం బాధాకరం. మన తెలుగు రాష్ట్రాల నుంచి మహా కుంభమేళాకు వెళ్ళేవారు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ప్రభుత్వ అధికారుల సూచనలు అనుసరించాలని విజ్ఞప్తి చేస్తున్నానని ట్విట్ చేశారు. ఇక తెలంగాణకు చెందిన మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్ రావులు ట్విట్టర్ వేదికగా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

ఇస్రో వందో ప్రయోగం.. నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 15



హైదరాబాద్, జనవరి 29: ఇస్రో వందో ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరి కోటలోని షార్ నుంచి జీఎస్ఎల్వీ రాకెట్-15 నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని రోదసిలోకి తీసుకెళ్లింది.

భారత నావిగేషన్ వ్యవస్థ నావిక్ సిరీస్‌లోని ఈ రెండో ఉపగ్రహం కచ్చితమైన పొజిషన్, వేగం, టైమింగ్‌తో భారత ఉపఖండం అవతల 1500 కి.మీ పరిధి వరకు యూజర్లకు కచ్చితమైన గమన సూచనలు(నావిగేషన్, ముఖ్యంగా నౌకాయానం) అందిస్తుంది. 50.9 మీటర్ల పొడవైన రాకెట్ జీఎస్ఎల్వీ-ఎఫ్12 మిషన్‌లో ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని గతేడాది మే 29 విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. నేడు నింగిలోకి దూసుకెళ్లిన 2,250 కిలోల బరువైన ఎన్‌వీఎస్-02 శాటిలైట్‌ను యూఆర్ శాటిలైట్ కేంద్రంలో రూపొందించి అభివృద్ధి పరిచారు. ఇందులో రేజింగ్ పేలోడ్‌కు అదనంగా ఎల్1, ఎల్5 నావిగేషన్ పేలోడ్లు ఉన్నాయి. ఈ ఉపగ్రహం అందించే నావిగేషన్ సమాచారాన్ని గగనతల, భూతల, జల మార్గాల్లో ఉపయోగించుకోవచ్చు. విమానాల నిర్వహణకు, మొబైల్స్‌లో స్థాన ఆధారిత సేవలకు, ఉపగ్రహాల కక్ష్య నిర్ధారణకు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత అప్లికేషన్లకు, ఈ ఉపగ్రహపు నావిగేషన్‌ను వాడుకోవచ్చని ఇస్రో తెలిపింది.

46 ఏండ్లలో 99 ప్రయోగాలు..

భారత్ తన మొదటి పెద్ద ఉపగ్రహాన్ని 1970, ఆగస్టు 10న శ్రీహరికోట నుంచి ప్రయోగించింది. ఇస్రో 99 ప్రయోగాలు చేయడానికి 46 ఏండ్ల సుదీర్ఘ కాలం పట్టింది. ఇప్పటివరకు ఇస్రో సాధించిన ప్రగతి వెనుక పలు తరాల శాస్త్రవేత్తల కృషి ఉన్నదని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం సంచాలకులు రాజరాజన్ మంగళవారం మీడియాకు తెలిపారు.

పిజి వైద్య విద్యలో రాష్ట్ర రిజర్వేషన్‌లు రద్దు ..సుప్రీం కోర్టు సంచలన తీర్పు

నల్గొండ, జనవరి 29: వైద్యవిద్యలో నివాస ఆధారిత కోటాను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాష్ట్ర కోటా కింద పీజీ సీట్ల కేటాయింపులో అనుసరిస్తున్న ఈ పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంచేసింది. ఈ మేరకు బుధవారం ముగ్గురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. "మనకు దేశంలో ఎక్కడైనా నివసించే హక్కు ఉంది. దేశంలోని ఏ విద్యాసంస్థలోనైనా చదువుకునే హక్కును రాజ్యాంగం ప్రసాదించింది. మనవంతా భారత్ భూభాగంలో నివసిస్తున్నాం కాబట్టి ఏ ప్రావిన్స్, ఏ రాష్ట్ర నివాసం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఉద్యోగం, వ్యాపారం చేసుకోవడానికి దేశంలో ఎక్కడైనా ఉండే హక్కు ఉంది. అలాగే చదువుకునే హక్కు కూడా" అని ధర్మాసనం వెల్లడించింది.

నిర్దిష్ట రాష్ట్రంలో నివసించేవారి విషయంలో రిజర్వేషన్ల గురించి ఆలోచించవచ్చని, అయితే అది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల వరకే అని వ్యాఖ్యానించింది. ఆ తర్వాత ఉన్నతవిద్యా కోర్సుల విషయంలో నివాస ప్రాంతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే.. ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లే అవుతుందని పేర్కొంది. అయితే ఇప్పటికే జారీ అయిన నివాస ఆధారిత రిజర్వేషన్లకు ఈ తీర్పు వర్తించదని పేర్కొంది.

పీజీ మెడికల్ కోర్సులకు నివాస ఆధారిత రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని గతంలో పంజాబ్-హరియాణా కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిని పలువురు సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. ఇద్దరు సభ్యుల ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది. అయితే కేసు ప్రాముఖ్యత దృష్ట్యా దానిని ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి సిఫారసు చేసింది. ఈక్రమంలోనే తాజా తీర్పు వెలువడింది.

చదువుతోనే విజ్ఞానం పెరుగుతుంది - మంత్రి సీతక్క

హైదరాబాద్, జనవరి 29:చదువుతోనే విజ్ఞానం పెరుగుతుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం లక్డికాపూల్ లోని ఎఫ్‌టీసీసీఐ కార్యాలయంలో విద్యాధన్ స్వచ్ఛంద సంస్థ స్కాలర్ షిప్ ల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో అన్నింటికంటే ఉత్తమమైనది విద్య అని, విద్యతోనే వికాసం సాధ్యపడుతుంది అన్నారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం విద్యా హక్కు చట్టం తెచ్చి 6-14 సంవత్సరాల మధ్య పిల్లలకు నిర్బంధ విద్యను ప్రవేశ పెట్టిందన్నారు. విద్యను ఎవరు దోచుకోలేరని, విద్య పంచుకుంటేనే విజ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు.. ఆ ఉద్దేశంతో విద్యాధన్ ఫౌండేషన్ పని చేయడం అభినందనీయమన్నారు.

చదువుకోవాలన్న పట్టుదల ఉంటే..

చదువుకోవాలన్న పట్టుదల ఉంటే చాలు ఉన్నత విద్య నేర్చుకోవచ్చునని మంత్రి సీతక్క అన్నారు. అందుకు తన జీవితమే ఒక ఉదాహరణ అని చెప్పారు. తాను టెన్త్ క్లాస్ వరకు చదువుకున్న తర్వాత పదేళ్ల పాటు అజ్ఞాత జీవితం గడిపానని, బయటకొచ్చిన తర్వాత తిరిగి విద్యార్థిగా చదువును కొనసాగించానని తెలిపారు. చదువుకోవాలన్న పట్టుదలతో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఎంఏ, పీచ్‌డీ పూర్తి చేశాను అని చెప్పారు. ఎమ్మెల్యే గా మంత్రిగా ఉన్నా విద్యను ఆపలేదన్నారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఎంఏ కోర్సును జాయిన్ అవ్వాలనుకుంటున్నానని చెప్పారు. మా నవ విలువలను, సంబంధాలను పటిష్టం చేసే విద్యను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. పేదలకు విద్య అందించే విద్యాధన్ ఫౌండేషన్‌కు తమ ప్రభుత్వ సహకారం ఎల్లవేళలా ఉంటుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

కారు బీభత్సం.. ముగ్గురికి తీవ్రగాయాల

-దుకాణాల వైపు వేగంతో దూసుకెళ్లిన కారు
-ముగ్గురికి తీవ్ర గాయాలు తప్పిన పెను ప్రమాదం
-ప్రమాదం నుంచి బయటపడిన కారు ఓనర్, డ్రైవర్

మెదక్,జనవరి 29: జోగిపేట హనుమాన్ చౌరస్తా వద్ద బుధవారం మధ్యాహ్నం కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో అతివేగంగా డ్రైవర్ ఈసా కారు నడపడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న దుకాణాల వైపు దూసుకెళ్లింది. ఈ సంఘటనలో రోడ్డుపై వస్తున్న ముగ్గురు వాహనదారులకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు వాహనాలను అతివేగంగా ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న టీడీపీ పార్టీ గద్దెకు కారు ఢీకొని ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.జోగిపేట నుంచి అన్నాసాగర్ వైపు వెళ్తున్న ఆక్సన్ పల్లి గ్రామానికి చెందిన రాజు, కన్సానిపల్లి నుంచి బైక్ పై గ్రామానికి చెందిన సంజీవులు, బాలయ్యలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వస్తున్న క్రమంలో వీరు ప్రయాణిస్తున్న బైక్ ను కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదంలో సంజీవులు బాలయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో సంజీవులు కాలుపై భాగంలో తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం వీరిని జోగిపేట ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన ముగ్గురికి వైద్యాధికారులు ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నారు.అన్నాసాగర్ నుంచి జోగిపేట వైపు వస్తున్న కారు నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే చౌరస్తాలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బొడ్మట్ పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మొగులయ్య వాహనం ఓనర్ అని పోలీసులు గుర్తించారు. కాగా ఈ ప్రమాదంలో కారు ఓనర్ మొగులయ్య, డ్రైవర్ ఈసా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మద్యం మత్తులో డ్రైవర్ కారు నడపడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని జోగిపేట ఏఎస్ఐ గౌస్ తెలిపారు.

సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం.. 9 మంది భారత పౌరులు దుర్మరణం

న్యూఢిల్లీ, జనవరి 29: సౌదీ అరేబియా లో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 9 మంది భారత పౌరులు దుర్మరణం పాలయ్యారు. సౌదీ అరేబియా పశ్చిమ ప్రాంతంలోని జిజాన్ నగరంలో ఈ ప్రమాదం జరిగింది. జెద్దా లోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. బాధిత కుటుంబాలకు తాము అండగా ఉంటామని, స్థానిక అధికారులతో బాధిత కుటుంబాలతో తాము ఘటనపై ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నది.

ప్రమాదంపై బాధిత కుటుంబాలు సమాచారం తెలుసుకోవడం కోసం అక్కడి భారత రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నెంబర్‌లను కూడా ఏర్పాటు చేసింది. సమాచారం కోసం 8002440003 (సీశ్రీశ్రీ టతీవవ), 0122614093, 0126614276, 0556122301 (చిష్ట్రజీబిబంజూజూ) నెంబర్లలో సంప్రదించాలని సూచించింది.

అరకొర ఏర్పాట్లు, వీఐపీలకు అధిక ప్రాధాన్యంవల్లే తొక్కిసలాట : మల్లికార్జున్ ఖర్గే

న్యూఢిల్లీ, జనవరి 29: మహా కుంభమేళా లో తొక్కిలాట చోటుచేసుకుని 14 మంది మరణించిన ఘటనపై కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. కుంభమేళాకు యూపీ ప్రభుత్వం అరకొర ఏర్పాట్లు చేసిందని, వరుస కట్టిన వీఐపీలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, దాంతో సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇవే తొక్కిసలాటకు ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. అంతేగాక కుంభమేళా ఏర్పాట్లపై ప్రభుత్వం సొంత డబ్బా కొట్టుకోవడం కూడా ఘటనకు మరో కారణంగా చెప్పుకోవచ్చని విశ్లేషించారు.

మహా కుంభమేళాలోని తీర్థరాజ్ సంగం తీరంలో తొక్కిసలాట జరిగి 14 మంది ప్రాణాలు కోల్పోవడం, పలువురు గాయాలపాలు కావడం బాధకరమైన విషయమని, ఆ వార్త గుండెలను పిండేసిందని ఖర్గే అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి కూడా ఏర్పాట్లు సరిగా చేయకపోవడం తీవ్రంగా ఖండించదగిన విషయం.

మహా కుంభమేళాలకు వీఐపీల రాకను అదుపు చేయాలని ఖర్గే సూచించారు. ఇలాంటి దుర్ఘటనలు మళ్లీ జరగకుండా ఉండాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా మేల్కొని ఏర్పాట్లను మెరుగుపర్చాలన్నారు. బాధితులకు కాంగ్రెస్ పార్టీ తరఫున అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. మౌనీ అమావాస్య సందర్భంగా సంగం ఘాట్‌లలో పుణ్యస్నానాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారని, అదే తొక్కిసలాటకు కారణమైందని యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ చెప్పారు.

తోటి సిబ్బంది నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన వెటర్నరీ వైద్యుడు

ఆదిలాబాద్, జనవరి 29: తోటి సిబ్బంది నుంచి లంచం తీసుకుంటూ వెటర్నరీ వైద్యుడుఏసీబీకి పట్టుబడిన ఘటన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలో చోటు చేసుకుంది. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉట్నూరు మండలం వెటర్నరీ వైద్యుడిగా పనిచేస్తున్న రమేష్ రాథోడ్ తన కార్యాలయంలో పనిచేసే సిబ్బంది పని కోసం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

ఉట్నూర్ మండలంలోని షాంపూర్ సబ్ సెంటర్లో వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జుగునాక మాధవ్ ఇటీవల వేరే ప్రాంతానికి బదిలీ అయ్యాడు.

మాధవ్‌కు సంబంధించిన రెండు నెలల వేతనం పెండింగ్‌లో ఉంది. వేతనం మంజూరు విషయమై మాధవ్ తన పై అధికారి రమేష్ రాథోడ్‌ను సంప్రదించాడు. అందుకు రూ.30 వేలు డిమాండ్ చేయగా రూ.15వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు బుధవారం మధ్యాహ్నం షాంపూర్ సబ్ సెంటర్లో రూ.15 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చురక

విశ్వానికి ట్రంపు నేడు
వివాదాల విషం పుట్ట
దిగుమతి సుంకాలపైన
దండిగ వేస్తుండు కట్ట
అడ్డకుంటే దేశాలు
ఆధిపత్య పెత్తనం
వ్యాపారం దోపిడీకి
విస్తరించు విత్తనం

-వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం- నేటికి అందం

అనునిత్యము స్వాతంత్ర్యపు
ఘనతను తలపోసుకొనుచు కైమోడ్పిడుచున్
జనులందరు జరుపవలయు
వినయము మీరంగ నమర వీరుల దినమున్

(జనవరి 30 భారత అమర వీరుల దినోత్సవం)

-రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం
సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 30-1-2025

బ్యూటీ స్పాట్

విశ్వం తెల్ల కాగితం మీద
సృష్టికర్త బొమ్మ గీసాడు
సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు
గ్రహాలూ.. ఉపగ్రహాలూ..

నదులూ కొండలూ పొలాలు గీశాక
అందమైన అమ్మాయిలాంటి
బొమ్మ బుగ్గమీద
బ్యూటీ స్పాట్ "పుట్టుమచ్చ" పెట్టాడు..
అదే "మనిషి".

-డా॥ రావి రంగారావు
సెల్: 9493686165

సంబరాలు

నిన్ను నీవు
తెలుసుకో
నిన్ను నీవు
గెలుచుకో

విజయం ఆయాచితం
కాదు
అది అవిశ్రాంత శ్రమ
ఫలితం.

నీ చిరునవ్వు
నీ గుర్తింపు చిహ్నం
నీ వ్యక్తిత్వం
నీ ధృవపత్రం

నీకన్నా ముందు తరం
నిన్ను సృష్టించింది
నీ తర్వాతి తరం
నీవు సృష్టించింది

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

కుటుంబ అనుబంధాలు మాయమైపోతున్నాయి

-శాసన మండలి ప్రతిపక్ష నాయకులు మధుసూదనాచారి

జర్నలిజం పతనానికి యాజమాన్యాల వైఖరే కారణం- ఎస్. వినయకుమార్

న్యాయవ్యవస్థ పత్రికా రంగంలో ఇంకా విలువలు వుండడం వల్లే సమాజం సజావుగా నడుస్తోంది-కె. రామచంద్రమూర్తి

త్యాగరాయ గానసభలో ఫణి భార్గవ్ జయంతి - జర్నలిస్టులకు, సేవా సంస్థలకు పురస్కారాలు

నేటి సమాజంలో కుటుంబ ఆప్యాయతలు, అనుబంధాలు మాయమై పోతున్నాయని శాసనమండలి ప్రతిపక్ష నాయకులు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ మరణించిన కుమారుని పేర ప్రతి ఏటా జర్నలిస్టులకు ప్రతిభా పురస్కారం, విద్యార్థులకు సామాజిక సేవా సంస్థలకు ఆర్థిక సహాయం అందించడం విశేషమని చెప్పారు. హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై కళానిలయం నంన్థ నిర్వహణలో సోమవారం ఫణి భార్గవ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు 'వెలుగు' పత్రిక సీనియర్ స్టేట్ బ్యూరో రిపోర్టర్ గండ్ర నవీన్, 'ఎన్.టి.వి' జర్నలిస్టు రాధిక, టి.వి.9 క్రైమ జర్నలిస్ట్ పి.జ్యోతికి నగదు ప్రతిభా పురస్కారం, విద్యార్థి క్రాంతి, అమృత వర్షిణి సేవా సంస్థకు ఆర్థిక పురస్కారాలను మధుసూదనాచారి, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, బైస దేవదాసు, ఎం.కె.రామము అందజేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు వినయకుమార్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

సీనియర్ సంపాదకులు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కార్యదర్శి యస్. వినయ్‌కుమార్‌కు ఆత్మీయంగ సత్కరిస్తున్న ఎ. సురేందర్, బైస దేవదాసు, శాసన మండలి ప్రతిపక్ష నాయకులు మధుసూదనాచారి, కె.రామచంద్రమూర్తి, ఎమ్.కె.రాము, కళా జనార్థనమూర్తి, రాయప్రోలు వెంకటరమణ

ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. జర్నలిజం రంగంలో విలువలు మానవ జాతి కల్తీ అయిన విధంగానే కల్తీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితుల్లో అంకిత భావం, సేవా గుణం ఉన్న ఫణి భార్గవ్‌ను గుర్తు చేసుకుంటూ ప్రతిభ ఉన్న జర్నలిస్టులను గుర్తించి గౌరవించడం మంచి ఆలోచనని అభినందించారు.

కె. రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. సమాజంలో అన్ని రంగాలు పతన స్థాయిలో ఉన్నా ఇంకా న్యాయ వ్యవస్థ..పత్రికా రంగంలో విలువలు ఉండటం వల్లే సమాజం సజావుగా నడుస్తోందని చెప్పారు. తల్లిదండ్రులు పోతే కొద్ది కాలానికే మరిచిపోతున్న రోజుల్లో కొడుకు స్మృతిలో పదేండ్లకుపైగా ఫణి భార్గవ్ జయంతిని ఘనంగా నిర్వహించడం అరుదు అన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ కవి డాక్టర్ ఎంకె.రాము మాట్లాడుతూ.. ఫణి భార్గవ్ విద్యార్థిగా సామాజిక చింతనతో పలు సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారని గుర్తు చేశారు. ఆయనజీవితం నేటి యువతకు మార్గ దర్శకం కావాలన్నారు.

బైస దేవదాసు మాట్లాడుతు జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఉద్యోగ బాధ్య తలను సమర్థవంతంగా నిర్వహిస్తు అందరి మన్ననలు పొందిన రమణ జీవితంలో చేతికందిన కొడుకు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం ఓ విషాదం. జర్నలిస్టుగా స్థిరపడాలన్న ఆశాభావం గల ఫణిభార్గవ్ పేరున ప్రతి సంవత్సరం ఉత్తమ జర్నలిస్టులను ఎంపిక చేసి వారికి పురస్కారాలు అందజేసి విషాదాన్ని మరచిపోయి పణిభార్గవ్ జన్మ దినోత్సవాన్ని జరుపుతు కొడుకుపట్ల తనకున్న ప్రేమను చాటుకుంటున్న రమణ అభినందనీయుడని బైస దేవదాసు అన్నారు.

పి. రాధిక, పి. జ్యోతి, గండ్ర నవీన్‌లకు నగదు పురస్కారం అందజేస్తున్న అతిథులు.

ఈ సభ తండ్రి కొడుకుల అనుబంధాన్ని మానవ విలువలను తెలియజేస్తోందని తెలిపారు.

ఈ పదేళ్ళు జరిపిన కార్యక్రమ వివరాలతో ఓ పుస్తకాన్ని హచ్చువేస్తే జ్ఞాపకంగా, అందరినీ ఆలోచింపజేసే విధంగా ఉంటుందని రమణకు సూచించారు.

వినయకుమార్ ప్రసంగిస్తూ.. జర్నలిజంలో విలువల పతనానికి కారణం యాజమాన్యాల వైఖరి అని చెప్పారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. పుచ్చలపల్లి సుందరయ్య సాహిత్యానికి, కళలకు, ప్రజా చైతన్యం మీడియాగా భావించారని, అందుకే సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. గానసభ అధ్యక్షులు కళా జనార్థ నమూర్తి ప్రారంభోపన్యాసంలో రమణ ఎంతో సౌమ్యుడని కల్చరల్ పాత్రికేయుడుగా గొప్ప గుర్తింపు కలిగిన వ్యక్తి అని , కొడుకుపట్ల తనకున్న ప్రేమను చాటుకుంటున్న రమణను అభినందించారు.

కురుగంటి కళాక్షేత్రం నృత్య గురువు శ్రీమతి రాధిక, శ్రీ సాయి నటరాజ అకాడమీ నృత్య గురువు శ్రీమతి తులసి శిష్య బృందం నృత్యాలు అందరినీ అలరించాయి. శ్రీమతి వేమూరి మంజుల లలితగీతాలు, కొండలరావు బృందం పాటలు ఆలపించారు.

చివర కళా నిలయం అధ్యక్షుడు ఎ. సురేందర్ వందన సమర్పణ చేశారు.

ఆత్మ హననం వద్దు

ముందుకు నడిపించే
'శ్రమ నిర్మాణం' కావాలి
గతంలో జీవిస్తూ బులిపించే
'వినిర్మాణం' పట్ల నిబద్ధత కాదు

మనసుల్ని ఒక చోట చేర్చే
'విశ్వ' ప్రయత్నం ధ్యేయం కావాలి
మనషుల్ని ఇలా కూడా బతకనివ్వని
'విధ్వంసం' లక్ష్యం కారాదు.

నలుగురి వలన బలిసి
పదిమంది కలివిడిని విరిచి
అమాయకత్వాన్ని కొనగోలు చేస్తూ
పబ్బంగడుపుకొనే తత్త్వం రారాదు

నలుగురు కలిసీ,
పొరుపులు మరచి, నవ్వుతూ
నమ్మకంతో సాగటం కావాలి.

చింతలోనైనా చాగురింతలో ఆహ్లాదం
ఆత్మీయతలో వెట్టతనం
అనుభూతి చినుకుల్లో హర్షం కావాలి!
అనురాగపు వెన్నెల్లో ఆనందం
అలతి అవస్థల చలిలో మధురిమ
ఋతువు రీతిలో
రాలు ఆకుల తత్త్వబోధ
కాలహేలలో జీవనరాగం
కావాలి!!

-విహారి
సెల్:9848025600

రే రాజు లేకుంటే రారాజే!

పశ్చిమాన భానుడు పవళించే వేళ
పగలుకు నల్లని తెరను దింపి
నిశ్శబ్దానికి నాంది పలుకుతూ
ఆవిష్కరించబడుతుంది చీకటి.
కొన్నింటికి నేస్తంగా
మరెన్నింటికో అవరోధంగా
రే రాజు లేని నాడు
రారాజులా వెలుగుతూ
వెలుగుకు కాస్త విరామమిస్తూ
నిషాలో తేలి తూలే నిశాచరుల
స్వైరవిహారానికి తెరలేపుతుంది
అప్పుడప్పుడు.
తళతళ అలలతో
నిదానంగా అలరారుతూ
శ్వాస తీసుకుంటుంది సముద్రం.
నిండు ఖనిజ గర్భాలతో
తపో ముద్రలో లీనమైన
మౌన మునులుగా
కునుకు తీస్తుంటాయి కొండలు.
లయల హ్వాయలకు విరామం తొడిగి
కొండల నడుమ ఒదిగి
గురక పెడుతుంటాయి లోయలు.
తెల్ల మొగం వేసుకొని
అరుణ కిరణాలకై
అలమటిస్తుంటాయి మేఘాలు.
మిణుక్కు మిణుక్కుమంటూ
వెలుగు తుంపరలను వెదజల్లుతూ
గగన తలంలో
ఓలలాడుతుంటాయి తారలు.
పగటి విషాలను కడుపారా ఆరగించి
ప్రాణికోటికి ప్రాణవాయువుని వడ్డిస్తూ
సంతసిస్తుంటాయి వృక్ష రాజాలు.
చెవులు రిక్కించి పవనుడి జోలపాటకై
తహతహలాడుతుంటాయి చెట్లుచేమలు.
రెక్కలకు విశ్రాంతినిస్తూ
తమ తమ గూళ్లలో
సేదదీరుతుంటాయి పక్షులు.
ఆకాశానికి నల్ల గొడుగు అడ్డు వేసి
భూగోళాన్ని సగం దాకా ఆక్రమించుకొని
భగ్నంకు తావులేని నగ్నత్వానికి
వేదికలు నిర్మిస్తుంది చీకటి.
కన్నాలకు కైంకర్యాన్ని
సకల దోపిడీలకు సౌకర్యాన్ని కలిగిస్తూ
మానప్రాణాలను భయం గుప్పిట్లోకి తోసి
నిశ్శబ్దంగా రంకెలు వేయిస్తుంది చీకటి.
భానుడి రాకతో శక్తులన్నీ ఉడిగి
వెలుతురు కౌగిలిలో ఒదిగి
వెన్నలా కరిగిపోతుంది చీకటి.



- ఆచార్య కడారు వీరారెడ్డి
9392447007

రూపాంతరం

కథ

"ఏమండీ! చాలా హుషారుగా ఉన్నారు, ఏంటీ సంగతి?" శ్రీముఖి అడిగింది.

"నిజంగా నాకివాళ చాలా ఆనందంగా ఉంది శ్రీ. ఆనందమే కాదు ఆశ్చర్యంగా కూడా ఉంది. ఒక వ్యక్తిలో అంత మార్పు సంభవమా?" జయదేవ్ మొహంలో ఓ వింత కాంతి.

"మీరు దేని గురించి అంటున్నారో నాకేమీ అర్థం కావడం లేదు. కాస్త వివరంగా చెప్పండి."

"చెబుతాను. చెబుతాను. నన్ను కాస్త ఫ్రెష్ అవనీయ్. నేను స్నానం చేసి వచ్చేలోగా స్ట్రాంగ్ కాఫీ పెట్టు" అని బాత్రూం లోకి దూరాడు జయదేవ్.

జయదేవ్ వృత్తిరీత్యా చార్టెడ్ ఎకౌంటంట్. శ్రీముఖి నాట్య గురువు. వారు అమెరికాలోని కాలిఫోర్నియాలో స్థిరపడ్డ అచ్చ తెలుగు వారు. జయదేవ్, అక్కడ "కార్పొరేట్ రంగంలో ఆడిటర్ల బాధ్యత" అనే విషయమై జరిగిన కాంఫరెన్స్ లో పాల్గొని అప్పుడే వచ్చాడు.

"ఇప్పుడు చెప్పండి మీ ఆనందానికీ, ఆశ్చర్యానికీ కారణం." తను ఇచ్చిన కాఫీ తాగిన తర్వాత అడిగింది శ్రీముఖి.

"ఎక్కడి ఆంధ్ర ప్రదేశ్? ఎక్కడి కాలిఫోర్నియా? ఒకప్పుడు వ్యాంప్ గా, ప్రత్యేక పాటల్లో(ఐటెం సాంగ్స్) లాంటి అంత గౌరవప్రదం కాని పాత్రల్లో నటించిన అప్పటి సినిమా నటి ఉన్నత చదువులు చదివి, ఇప్పుడు ఇక్కడ ఆడిటర్ గా దర్శన మిచ్చేసరికి నాకు నోట మాట రాలేదు. నా సందేహం తీర్చుకోవడానికి 'మీరు ఫలానా లాగా ఉన్నారు' అన్నాను. 'ఫలానా లాగా కాదు, ఫలానానే' అన్నారు. అప్పుడు ఆశ్చర్యపోవడం నా వంతయింది. వారిలో అంత మార్పు ఎలా వచ్చిందో, వారిని అడగడానికి మొహమాటం అడ్డొచ్చింది. కాని తెలుసుకోవడం ఎలా? వెంటనే గూగులమ్మ అభయమిచ్చింది. ఆమెను సంప్రదిస్తే వివరాలన్నీ తెలిశాయి."

"ఆ వివరాలేంటో వెంటనే చెప్పండి శ్రీవారూ" శ్రీముఖి ఉత్కంఠను ఆపుకోలేకపోయింది.

"ఐతే విను. వారు, తన అన్నగారి ప్రియమిత్రుని పెళ్లి చేసుకొని, భర్త ఉద్యోగరీత్యా, ఇటలీ వేళ్లారు. అక్కడి నుండే ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ప్రైవేట్ గా మెట్రిక్యులేషన్ కు కట్టి పాసయ్యారు. ఆ తర్వాత ప్రైవేట్ గానే మద్రాస్ విశ్వవిద్యాలయం నుండి బీ.కాం. పాసయ్యారు. 1991 లో అమెరికాకు మారిన తర్వాత అకౌంటింగ్ మరియు సర్టిఫైడ్ పబ్లిక్ అకౌంటింగ్ లో మాస్టర్ డిగ్రీ చేశారు. కొన్ని రోజులు వర్జీనియా పాలిటెక్నిక్ విశ్వవిద్యాలయంలో ఆడిటర్ గా, బడ్జెటింగ్ అధికారిగా పనిచేసి, ప్రస్తుతం ఇక్కడ, ఒక సాఫ్ట్ వేర్ కంపెనీకి అధిపతి ఐన, తన కుమారుని వద్ద ఉంటున్నారు. ఫ్రీలాంస్ ఆడిటర్ గా వివిధ కంపెనీలకు కన్సల్టంట్ గా సేవ లందిస్తున్నారు. ఆ హోదాలోనే మా కాంఫరెన్స్ లో పాల్గొన్నారు. గ్లామర్ పరిశ్రమలో పని చేసిన వారు, ఒక సీరియస్, గౌరవప్రదమైన రంగాన్ని ఎంచుకొని దానిలో కృతకృత్యులు కావడం ముదావహం. 'పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు' అనే నానుడికి ప్రత్యక్ష ఉదాహరణ వారు. అది ఇతరులకు స్ఫూర్తిదాయకం. ఒక నాటి సినిమా నటి, పెళ్లి తర్వాత ఉన్నత చదువులు చదివి, ఒక గౌరవప్రద మహిళగా రూపాంతరం చెందడం నిజంగా ఆశ్చర్యకరమే. ఆనందకరమే, ఆదర్శప్రాయమే." నేను టూకీగా వారి చరిత్ర చెప్పాను.

"అబ్బబ్బ సస్పెన్స్ తో చంపుతున్నారు. అదంతా సరే గానీ ఇంతకీ వారి పేరేమిటండీ?" - శ్రీముఖి

అప్పుడు జయదేవ్ తన ఫోన్ లోని ఒక సెల్ఫీని చూపిస్తూ "వీరెవరో పోల్చుకో చూద్దాం"

తన భర్తతో పాటు సిల్క్ చీర కట్టుకొని మహాలక్ష్మి మూర్తీభవించినట్టుగా ఉన్నామెను పరీక్షగా చూసి, "ఎవరో తెలీదు కానీ మొత్తం మీద మన తెలుగు ఆడపడుచులా ఉందండీ"

"నీ తెలివికి సంతోషించా కానీ నీ ఊహ సగమే నిజం శ్రీ!, వారిని మనం చాలా సార్లు వెండి తెరపై చూశాం. వారు, నాటి ప్రసిద్ధ నాట్య తార లతాశ్రీ గారు. నేడు అమెరికాలో పేరు పొందిన ఆడిటర్!"

"అవునా! నిజమా! నేనస్సలు ఊహించనే లేదు. నా కిప్పటికీ నమ్మకం కుదరడం లేదు. నేను చిన్నప్పుడు వారి సినిమాలు చాలా చూశాను. ఆమె లాగా నాట్యం చేయడానికి కూడా ప్రయత్నించేదాన్ని. ఆమె ఇప్పుడు అమెరికాలో ఉందని తెలిసి నాకు ఎంత ఆనందంగా ఉందో మాటల్లో చెప్పలేను. ఏమండీ! ఆమెను మనింటికి భోజనానికి పిలవరూ? ఆవిడతో ఫోటో తీసుకుని మా మహిళా వాట్సప్ గ్రూపులో పెడితే నా పరపతి పెరుగుతుంది." శ్రీముఖి స్వార్థం ఆమెది.

ఏమండీ! ఆమెను మనింటికి భోజనానికి పిలవరూ? ఆవిడతో ఫోటో తీసుకుని మా మహిళా వాట్సప్ గ్రూపులో పెడితే నా పరపతి పెరుగుతుంది."

"అంటే వారిపై అభిమానంతో కాదు, నీ పరపతి పెంచుకోవడానికి వారికి విందు ఇద్దామంటావు?"

జయదేవ్ భార్యను ఉడికించే అవకాశం వదలదల్చుకోలేదు.

"పోండీ! మేరెప్పుడు నా కోరికను తేలిగ్గా మన్నించారు కనుక?" శ్రీముఖిలో కినుకు.

"సరే. సరే. వారిని అడిగి చూస్తాను. ఒప్పుకుంటే నీ అదృష్టం." జయదేవ్ తలూపాడు.

లతాశ్రీ గారు వారింటికి భోజనానికి వెళ్లారో లేదో మనకు అనవసరం. కానీ వారు సమూలంగా రూపాంతరం చెందారనేది పచ్చి నిజం. అది హర్షనీయం. స్వస్తి.

-అంబల్ల జనార్థన్
8850349858

సాహితీ రత్నాలు

మహమ్మదీయ సుల్తానులు, ఆంగ్రేయులు, సుమారు వేయి సంవత్సరాల కాలం భారతదేశాన్ని అస్వతంత్ర రాజ్యంగా పరిపాలన చేశారు. ముఖ్యంగా బ్రిటీష్ వలస పాలకులు తమ వ్యాపారాభివృద్ధి కోసం భారతీయ సంస్కృతిని విధ్వంసం చేశారు. దాని ఫలితంగా కొన్ని వేల సంవత్సరాల నుండి దేశానికి మార్గదర్శకంగా ఉన్న సంస్కృత భాష, సాహిత్యాలు ప్రజలకు దూరమై పోయినాయి. మన విజ్ఞాన నిధి తెరమరుగున పడిపోయింది.

అత్యంత ప్రాచీన కాలం నుండే ప్రపంచానికి విజ్ఞానాన్ని ప్రసాదించిన వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, చరిత్రలు మున్నగు బహుముఖీనమైన ప్రక్రియలు ఇక్కడ విలసిల్లినాయి. భాషా, గణిత, జ్యోతిష, వైద్య, విజ్ఞాన గ్రంథాలేకాక రత్నశాస్త్రం, గజ శాస్త్రం, అశ్వశాస్త్రం మొదలైన శాస్త్రాలు సంస్కృతంలో విరచితమైనాయి. ఆదికవి వాల్మీకి మొదలుకొని అసంఖ్యాకులైన కవులు, నాటక కర్తలు, సంస్కృత సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

కవికుల గురువైన కాళిదాస మహాకవి శాకుంతల నాటకాన్ని చదివి "ఆది స్వర్గ-మర్త్య లోకాలు మధ్య మదురమైన వంతెన" (ఇ అం ఖ శ్రీఅఅనె ఎఖ్ఖవవఅ ఖుతీష్ఠ ఖఅం జుఖుతీఖుంఅంవ) అని భావించిన జర్మన్ విద్యాంసుడు గెరే ఆనందం పట్టలేక విధిలో గంతులేస్తూ నర్తించాడు. (క్రీ॥శ॥ ఒకటవ శతాబ్దం నాటికే విరచితమైన శూద్రకుని "మృచ్ఛకటిక" రూపకం పలు ప్రపంచ భాషల్లో పరివర్తితమై జజగత్ప్రసిద్ధం గాంచింది.

సంస్కృత సాహిత్యంలో నవరత్నాలు, తెలుగు సాహిత్యంలో అష్ట దిగ్గజాలు మున్నగువారు సారస్వత కోవిదులైన మన దేశ ప్రభువుల సాహిత్య పోషణకు ఎత్తిన పతాకాలుగా నిలుస్తారు. గీర్వాణ భాషలో ఉత్తమోత్తమమైన కావ్య నాటకాలను, గద్య రచనలను వెలువరించిన తొమ్మిదిమంది ప్రాచీన కవులను "నవకవిరత్నాలు"గా చౌదూరి నరసింహారావు నేటి యువతరానికి పరిచయం చేయటం ముదావహం.

ప్రతులకు:
చౌదూరి నరసింహారావు
సెల్: 9705100788

చౌదూరి నరసింహారావు రచన "నవ కవి రత్నాలు" పుస్తకానికి ఆచార్య ఎస్వీ రామారావు గారు రాసిన ముందు మాట..

"ఉపమా కాళిదాసస్య
భారవేరర్థగౌరవం
దండినః పదలాలిత్యం
మాఘే సంతి త్రయోగుణాః'అని ప్రసిద్ధి ఉంది. కాదంబరి గద్యకావ్య కర్త "బాణోచ్ఛిష్టం జగత్ సర్వం" అని ప్రఖ్యాతి గడించారు. కాళిదాసు, భవభూతి, శ్రీహర్షుడు, భారవి, విశాఖదత్తుడు, భాసుడు, శూద్రకుడు, బాణుడు, హర్షుడు-తొమ్మిదిమంది కవి రత్నాలను ఎన్నుకొని వారి చరిత్రతోపాటు కవిత్వ విశేషాలను సంక్షిప్తంగా సామాన్య పాఠకుల కోసం ముఖ్యంగా నేటి విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం వివరించాడు చౌదూరి. కవుల గురించి ప్రచారంలో ఉన్న కట్టుకథలను కూడా గ్రంథస్థం చేసాడు ఈ గ్రంథ రచయిత.

"ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే" అని ప్రసిద్ధి గడించిన భవభూతి మహాకవి తన నివాసంగా చెప్పుకొన్న పద్మపురి నేటి నిజామాబాద్ జిల్లాలోని బోధన్ పట్టణంగా (పౌదన్యపురం, పోదన) అని తెలంగాణ పరిశోధకులు గుర్తించారు. ప్రాకృత బృహత్కథా కావ్యాన్ని (క్రీ.శ.1వ శ) అనువదించిన సోమదేవసూరి (కథా సరిత్సాగర కర్త) ఈ ప్రాంతంలోనే నివసించాడు. ప్రసిద్ధ సంస్కృత కావ్య వ్యాఖ్యాత కొలిచాల మల్లినాథసూరి మెదక్ జిల్లా కొల్చారంకు చెందినవాడు కావటం గర్వకారణం. మన రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృత భాషా సాహిత్యాల ప్రకాశానికి దోహదం చేయగలదని ఆశిద్దాం.

కవి విశిష్టుడైన చౌదూరి నరసింహారావు ఆణిముత్యాలు మున్నగు కవితా సంపుటులు వెలువరించి సాహితీ రంగంలో స్థానం సంపాదించుకొన్నాడు. తన రెండు కవిత్వ రచనలతో పాటు ఈ వ్యాస సంపుటికి కూడా నా ముందు మాట కోరటం నాపై అతనికి గల అభిమానానికి నిదర్శనం. తెలుగు పాఠకులకు సంస్కృత కవి రత్నాల ప్రతిభను చవిచూపిన చౌదూరికి నా శుభాకాంక్షలు

-ఆచార్య ఎస్వీ రామారావు

ప్రతిభతోనే..

కొండను చూసి కుళ్ళుకోకు
అంతరిక్షాన్ని చూసి అసూయపడకు.
ప్రతిభతోనే పేరు పెరుగు
పనితనముతోనే పదుగురూ మెచ్చు.

కోకిల కమ్మని రాగం
కోకిల కీర్తిని పెంచే.

నెమలి నేర్పైన నాట్యం
నెమలి నామమును పెంచే.

కాలం పరుగుల పవనం.
కాలానికి కళ్లెం లేదు.

కాలం పై కదం తొక్కుతూ
కర్తవ్యం వైపు కదలాలి.

అసూయతో అందల మెక్కలేవు
సాధన తో సర్వం సాధ్యం.
సత్సంకల్పం తో సాధించాలి
జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.

-డి.కె. చదువులు బాబు
9440703716

జాగ్రత్త

వర్షంలో తడవకుండా వుండడానికి
గొడుగు దగ్గరవుంచుకోవాలి
ప్రయాణంలో ఆకలికి భోజనం
తోడుతీసుకెళ్ళాలి
పరీక్షలు బాగారాయాలంటే
ముందే కష్టపడి చదువుకోవాలి
నీటికొరత రాకముందే
నీటి ఏర్పాటు చేసుకోవాలి
ప్రమాదం రాకముందే దాన్ని
అధిగమించడానికి
పథకం తయారుచేసుకోవాలి
అనుదినం మెలకువగావుంటే
ఎన్నో సమస్యలు దాటవచ్చు
దావానలం కాలిఫోర్నియాను
కాల్చేస్తే మూడిళ్ళు
మిగిలిపోయాయి
అవి సమాజాన్ని కష్టాలనుంచి
కాపాడిన వారిళ్ళు
అవి దానధర్మాలు చేసి
నిస్సహాయులకు
సహాయం అందించిన
వారి గృహాలు
వైద్యశాలలు కట్టించి
ఉచిత వైద్యసహాయం అందించిన
వారి ఆస్తులు
మంచికి మంచే జరుగుతుంది
మంచిని బ్రతికిద్దాం
మనమూ హాయిగా బ్రతుకుదాం
మనం చేసే మంచి, చెడులే
మనల్ని కాపాడినా బాధించినా
ఈ చిన్నమాట తెలుసుకుంటే
కష్టాలు మన దరికిరావు
ముందే మంచిపనులు చెస్తే
దానివలన లభించే ఫలమే
మనకు, మన ఆస్తులకు రక్ష

-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

జారిపడడమే మనిషి కిష్టము

మనిషికి పనతమవడంలో
ఉన్న ఆనందం
ఉన్నతిని పొందడంలో ఉండదు.
జారుడుబల్లపై
జారేప్పుడుండే ఆనందం
జారేందుకు
మెట్ల నెక్కడంలో ఉండదు.

మెట్ల నెక్కడం
విసుగనిపించిన పిల్లాడు
జారేవైపు నుండే
ఎక్కేందుకు యత్నిస్తుంటాడు.
జారే కొద్దీ
ఎక్కేందుకు యత్నిస్తాడు.

జారేవైపు నుండి కూడా
జారకండా ఎక్కడం వచ్చేశాక
జారుడుబల్ల ఆటను
మానేస్తాడు వీడు.

ఏతా ఏతా తేలేదేమంటే
మనిషికి
జారిపోవడంలో ఉన్న ఆనందం
ఎక్కడంలో ఉండదు.
మనిషి నిరంతరమూ
సాధ్యమైనంత ఎత్తుకి
వెళ్ళేందుకే యత్నిస్తాడు.

ఎంత ఎత్తుకి వెళితే
అంత సేపు జారిపోచ్చు
అంతకు మించిన
వేగంతోనూ జారవచ్చు.

జారిపడ్డంలో ఉండే ఆనందాన్ని
పొందగలందులకు గాను
చేతనైనంత ఎత్తుకు వెళ్ళడం మినహా
మనిషికి మరో మార్గం లేదు కదా!

- వరిగొండ కాంతాకావు
సెల్: 94418 66624

అపద్భాంధవుడవైన నీవే..

వాహనాలపై ఎక్కి
తహతహ లాడుతూ
హుషారుగా వేగంగా
పరేషాన్ అయ్యేతా పోయి
అపరేషన్ల పాలయ్యి
అపద్భాంధవుడవైన నీవే
అపతిల పడితెల్లా..!
కారులలో బైకులలో
జోరుగా జల్సాగా
గేరులు మారుస్తూ
అతి వేగంగా పోతూ
మితిమీరిన వేగానందంతో
మతి భ్రమించేలా నడిపి
చితి మెట్లెక్కితెల్లా...!
వేగంగా వెళ్ళేందుకు
ఆగం అయ్యేదెందుకు
ఆళి పిల్లల భవితకై
తలిదండ్రులకు కలత మిగల్చక
తల్లడిల్లే హృదయాల కోసమైనా
వేగమొద్దు, ఆత్ర పడవద్దు..
చిత్ర విచిత్ర గాయాలతో
చిత్రగుప్తుడి లెక్కలలో
చిక్కుక పోవద్దంటే..
తక్కువ కావొద్దంతే..

-కొక్కె రాములు
9985341992

నానీలు

బయట ఎండైతే
భద్రంగా గొడుగు తీయ్
బతుకు భారమైతే
ధైర్యంగా అడుగువెయ్
విశ్వప్రేమ మాత్రం
జగమంతా ఒకటే
భాషల అనులిపిలో
పలుకు భావమొకటే



-తుమ్మూరి రాంమోహన్ రావు
9701522234

నాటి తరం వారి కథలు నేటి తరానికి
కథల వంతెన

రాజకీయం

కథ

-కంది రామచంద్రారెడ్డి

1996లో రాసిన కథ

శ్రీను ఆయాసంగా పరిగెత్తుకుంటూ వచ్చి చెబుతున్నాడు. వసారాలో కూర్చొని పేపర్ చదువుతున్న వెంకయ్యకు "అన్నా.. ఆ జగపతి వర్గం వాళ్ళు రాజుపేటలో మందు విపరీతంగా పోస్తున్నారు. సారా డ్రమ్ములు దించారు. అది పడని వారికి క్వార్టరు బాటిళ్ళు ఇస్తున్నారు. జనం అంతా వాడి దగ్గర జాతరుకు మాగినట్టు మూగారు".

వెంకయ్య అంటే మామూలు వ్యక్తికాదు. అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే, ఈసారి గెలిస్తే మంత్రి పదవి దక్కవచ్చన్న ఆశ మిణుకు మిణుకుమంటోంది. ఎన్నికలలో ధీమాగా ఉన్న వెంకయ్యకు, అర్థబలం సమృద్ధిగా ఉన్న గజపతి ప్రత్యర్థి కావడం ఆందోళన కలిగిస్తోంది.

పేపర్ ప్రక్కన పడేసి ఆలోచనలో పడ్డ వెంకయ్యకు మరో వైపు బండి మీద రమణ వేగంగా వస్తుండడం కనిపించింది.

"ఏంట్రా.. ఎందుకంత స్పీడు.. ఏంకొంపలు మునిగాయని" వచ్చిరాగానే రమణను ప్రశ్నించాడు.

ఆ గజపతి వాళ్ళు డబ్బు సంచులు దింపారన్నా.. రామన్న గూడెంలో ఓటుకు వందరూపాయలు ఇస్తున్నారు. జనం డబ్బు కోసం ఎగబడుతున్నారు. రమణ చెప్పడం పూర్తి కాకమునుపే రయ్యన వచ్చి ఆగింది తెల్ల మారుతి.

> "అన్నా.. ఆ జగపతి వర్గం వాళ్ళు రాజుపేటలో మందు విపరీతంగా పోస్తు న్నారు. సారా డ్రమ్ములు దించారు. అది పడని వారికి క్వార్టరు బాటిళ్ళు ఇస్తున్నారు. జనం అంతా వాడి దగ్గర జాతరుకు మాగినట్టు మూగారు".

అందరి దృష్టి అటువైపు మళ్ళింది. కారు నెంబరు పాతదే. ఎవరొచ్చారో అర్థమైంది. వారు కూడా ఏదో సమాచారం మోసుకొచ్చి ఉటారన్న అంచనా నిజం చేస్తూ సుబ్బారెడ్డి చెప్పడం మొదలు పెట్టాడు.

సార్.. ఆ గజపతి వాళ్ళు రామ్‌నగర్ కాలనీలో ఇంటింటికీ తిరిగి చీరలు పంచుతున్నారు.

వెంకయ్య తల గిర్రున తిరుగుతోంది. గజపతిని కాల్చిపారేయాలన్న కోపం వస్తోంది.

"వాడు డబ్బును నీళ్ళలా ఖర్చు పెడుతున్నాడు. వెంకయ్యను మట్టి కరిపిస్తానంటూ ఎక్కడ పడితే అక్కడ చాలెంజ్‌ల మీద ఛాలెంజ్‌లు విసురుతున్నాడు. లక్షలు గుమ్మరించి టిక్కెట్ కొనుకున్నాడు. ఏం సాధిద్దామనో.. వెధవ.." వెంకయ్య ఆగ్రహంతో ఊగి పోతున్నాడు.

మనసు లోపల మహా నదులు పోటెత్తుతున్న పైకి తొణక్కుండా ఉండడమే రాజకీయమని ఆయన గురువు వెంకారెడ్డి చెప్పిన మాటలు మనసులో మెదలాడడంతో ఆవేశం చప్పున చల్లారింది. ఆలోచన మొదలైంది.

"అన్నా.. ఎలాగైనా వాడి దూకుడుకు అడ్డుకట్ట వేయాలి.. లేకపోతే మన గెలుపు కష్టం.." అనుచరులు పరిస్థితిని వివరిస్తున్నారు.

"బెల్లమున్న చోటే ఈగలు ముసురుతాయి. డబ్బు సంచులు విప్పాడు కదా! అలాగే ఎగబడతాడు. జనం తెలివి మీరారు. ఎంత సేవ చేసింది లెక్కలేదు.. రాత్రనక, పగలనక ఏ సాయం చేసిందీ గుర్తుండదు. ఎన్నికలొస్తే ఎవడు పచ్చనోటు పంచి పెడితే వాడి పంచన చేరుతారు. ఛీ! అయినా పరుగులు పెట్టనీ.. ఎంత దూరం ఆ పరుగు? వాడి దూకుడుకు ఎలా కళ్ళెం వేయాలో నాకు బాగా తెలుసు? వెంకయ్య ముఖంలో ధీమా ప్రదర్శిస్తున్నాడు.

ఐదేళ్ళలో అసెంబ్లీతో పాటు మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికలకు ఎదుర్కొన్న అనుభవం ఆయనది. ఏ సమయంలో పచ్చనోట్లు పంచాలి. ఏ వర్గాన్ని ఎలా దువ్వాలి. ఎవరి దూకుడుకు ఎలా ముకుతాడు వేయాలి. అన్నీ అనుభవ పూర్వకంగా నేర్చుకున్నాడు.

"ఎలక్షన్లు ఇంకా వారం ఉన్నాయి. అప్పుడే ప్రారంభిస్తే ఎంత ఖర్చవుతుందిరా.. అయినా ఇప్పుడు తీసుకున్న వాడికి ఎన్నికల రోజు వీడిచ్చింది గుర్తొస్తుందా?" వెంకయ్య అనుచరులు ధైర్యం నూరిపోస్తున్నాడు.

"ఒరేయ్ యాదగిరి.. నువ్వు మన కారు తీసుకొని ఫోటోగ్రాఫర్‌ను, విలేఖర్లందరినీ కారులో ఎక్కించుకొని వాడు డబ్బు, మందు పంచిపెట్టే అన్ని ఏరియాలకు తీసుకెళ్ళు

విలేఖర్లందరితో ఫోన్ చేసి మాట్లాడతా.. నువ్వు కారులో వెళ్ళు'

×××

"ఓట్లు కొనేందుకు గణపతి ప్రయత్నాలు- పొంగి పొర్లిన మద్యం, డబ్బు, మహిళలకు చీరల గాలం" పత్రికలలో పతాక శీర్షికలు కళకళలాడాయి.

జిల్లా రాజకీయ వర్గాల్లో ఆ వార్తలు గుబులు రేపాయి. పెనుసంచల నమయ్యాయి.

వెంకయ్య వ్యూహం ఫలించింది. పోలీస్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ల నిఘా పెరిగింది. పత్రికల వార్తలతో గజపతి తన పంపకాలకు ఫుల్‌స్టాప్ పెట్టక తప్పింది కాదు.

ఎక్కడ ఇద్దరు పిచ్చాపాటిగా మాట్లాడుకున్నా రాజకీయాలే ప్రధానాంశమవుతున్నాయి.

'ఎవరు గెలుస్తారు..? ఎంత మెజారిటీ వస్తుంది.

వెంకయ్యా.. గజపతా..?

'అయినా ప్రజలేడ ఎన్నుకుంటున్నారు. నాయకుణ్ణి డబ్బు కదా ఎన్నుకునేది. ఎవరు ఎక్కువ లక్షలు ఖర్చు పెడితే వారిదే గెలుపు.

డబ్బుంటే చాలు.. ఎవరుపడితే వాళ్ళు వెనకా ముందు ఆలోచించకుండా రాజకీయాల్లోకి దిగుతున్నారు. ఇదీ వ్యాపారమైపోయింది. డబ్బు, మద్యం, దొంగోట్లు.. వీటితోనే రాజకీయాలు నిండిపోయాయి. ఓ యువకుడు కాఫీ హోటల్లో రాజకాయాలపై అనాసక్తి ప్రదర్శించాడు.

"ఎన్నికంటే ఎవరికి పండుగ కాదు. జెండాలు మోసేవాళ్ళకు.. సున్నాలు కొట్టేవాళ్ళకు.. బ్యానర్లు రాసే వాళ్ళకు.. అచ్చుగుద్దేవాళ్ళకు.. పోస్టర్లు అంటించే వాళ్ళకు.. కార్యకర్తలకు పేద ఓటర్లకు.. కష్టజీవులకు.. వీరందరూ ఎన్నికలు కోరుకునేవారే.

ఒకరినొకరు పోటీపడి నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభలు, ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలతో ప్రచార ఘట్టం రసవత్తరమైంది. ఎన్నికల ప్రక్రియ క్లూమాక్స్‌కు చేరుకుంది. ఇక పోలింగ్‌కు మూడు రోజులే గడువుంది. ప్రతిపక్ష పార్టీ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసింది.

పార్టీ పెట్టిన వాహనాల్లో జనం తండోపతండాలుగా తరలి వచ్చారు.

రాష్ట్రంలో ప్రతిపక్ష నేత ప్రసంగం మొదలు పెట్టాడు. ప్రియమైన ప్రజలారా...!నేను చెప్పేదేమిటంటే అధికార పక్షం వాళ్ళు పురుగులు, నురుగులు, ఏమెరుగని వట్టిచేట పెయ్యలు, ఇంఆ గోడమీద నీడలు, చేతగాని వాజెమ్ములు.. ప్రజల సొమ్ముతినే ధగుల్జాజీలు.. మీరు మళ్లీ గెలిపిస్తే మిమ్మల్ని అమ్మడానికి సిద్ధంగా ఉన్న మాయల మరాఠీలు.. అంటూ ఆవేశపడి అధికార పార్టీపై తిట్ల తుఫాను కురిపిస్తున్నాడు. పక్కనే ఉలుకూ పలుకూ లేకుండా జీవం లేని కొయ్య బొమ్మలా ప్రజలకు దండం పెడుతూ నిల్చున్నాడు. గజపి, కూలి డబ్బులు ఇచ్చారని రాఘవాపురం నుంచి రామయ్య లారీ ఎక్కి మీటింగ్‌కొచ్చాడు. మైకులో పెదాయన ఏం మాట్లాడాడో అర్థంకాక ఆయన బుర్ర తిరిగిపోయింది. ప్రతిపక్ష పార్టీకి ఢీటుగా మరుసటి రోజు అధికార పక్షం బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేసింది. గ్రామాల్లోకి లారీలు పంపింది. తమకు రెండు రోజులు కూలీ ఇస్తేగాని మీటింగ్‌కు రామని రాఘవ పురం ప్రజలు తేల్చేశారు. దీంతో వెంకయ్య అనుచరులు యాదగిరి, శ్రీనులు ఖంగుతున్నారు.

"తుంటిమీద కొడితే మూతిపళ్ళు రాలే రోజులొచ్చాయి. మీటింగులో పాల్గొనడానికి కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటే గెలిచిన వాడు సంపాదించుకోక ఏం చేస్తడు.. యాదగిరన్నా వెంకయ్యగారికి ఫోన్ చేయి" అన్నాడు శ్రీను.

చివరకు రెండు రోజుల కూలీ సాధించుకుని రాఘవాపురం ప్రజలు లారీ ఎక్కారు. అందులో రామయ్య కూడా ఉన్నాడు.

ఒక్క పదవితో లక్షలు వెనుకవేసుకోవాలనుకుంటాడు నాయకుడు. ఒక్క ఎలక్షన్‌తో 'పైకొచ్చే' యాలనుకుంటూరు కార్యకర్తలు. ఆ ఒకటి రెండు రోజులైనా కడుపు నిండా తిండి తినాలనుకుంటాడు పేద ఓటరు.

బహిరంగ సభకు జనాన్ని అత్యధికంగా తరలించడంలో అధికార పార్టీ సఫలమైంది. మీటింగ్ ప్రారంభమైంది. పార్టీ అధినేత ఆకాశమే హద్దుగా హామీల జల్లులు కురిపిస్తూ.. అరచేతిలో వైకుంఠం చూపిస్తూ తన ప్రసంగ పాఠాన్ని వినిపిస్తున్నాడు.

జనంలో ఒకడు లేచి అయ్యా...! మా మద్దిరాల చెరువు.. చెప్పడం పూర్తిగా కాక మునుపే అధినేత అందుకున్నాడు.. పెద్ద మనిషి.! నాకు తెలుసు.. మీ చెరువు ఎండిపోయిందని.. తిండి గింజలకు కష్టమౌతుందని.. ఎన్నికల్లో మా పార్టీకి ఓట్లు వేసి గెలిపించండి.. వర్షాలు కురిసి చెరువు నిండేంత వరకు మీ గ్రామస్థులందరికి ఉచిత భోజన సదుపాయం కల్పిస్తాం అన్నాడు. అయ్యా మా పల్లెలో ఇస్కూలు లేదు. మరొకడు అందుకున్నాడు. మీ పల్లెలో తెలుగు మీడియమే కాదు. ఇంగ్లీష్ మీడియం కూడా పెడతా.. కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తాం. ఇంజనీరింగ్ కాలేజ్ కూడా మం జూరు చేస్తా, ఇలా హామీల వర్షం కురిపిస్తుంటే జనం తడిసి ముద్దయ్యారు. ప్రజలు నేల మీది నుంచి లేచి గాలిలో తేలియాడుతున్నారు.

××

ప్రాణం-ఎంత చిన్నదో, అంత పెద్దది. సంపన్నులకు అది ఎక్కడుంటుందో తెలియదు. కానీ పేదలకు మాత్రం కడుపులో ఉంటుంది. గంజిపోస్తే నిలుస్తుంది..పొయ్యకపోతే పోతుంది. ఎన్నికలంటే తన కడుపుకు వైభోగమొచ్చిందని ఆనంద పడతాడు.

ప్రచార ఘట్టం పరిస మాప్తమైంది. వెంకయ్య వాళ్ళు అర్థరాత్రి కార్లలో పల్లెల కు చేరారు. సీట్ల కింద ఉన్న డబ్బు సం చులు తీసారు. సీసాలతో ఓటర్లు కళు ళ జిగేల్ మ నిపిస్తున్నారు. ఎవడికి డబ్బు.. మందు పంచితే వర్కవుట్ అవుతుందో వెంకయ్యకు బాగా తెలుసు.. పంచ్ కాన్ని తన అనుచరుల తో జోరుగా కొనసాగిస్తున్నాడు.

> ప్రాణం-ఎంత చిన్నదో, అంత పెద్దది. సంపన్నులకు అది ఎక్కడుం టుందో తెలియదు. కానీ పేదలకు మాత్రం కడుపులో ఉంటుంది. గంజిపోస్తే నిలుస్తుంది.. పొయ్యకపోతే పోతుంది.

"అన్నా.. అన్నా' రమణ ఆయాసం గా పరుగెత్తుకు వచ్చాడు.

"ఏమైందిరా"?

"మన శివారెడ్డి గారు లేరు.. ఘోరం జరిగిపోయిం దన్నా"

"ఏమైందో చెప్పు"

"ఆ గజపతికి అమ్ముడుపో యాడన్నా.. చిన్నగూడెం వాళ్ళందరికి ఆ గజపతి గుర్తుకే ఓటేయమని చెబుతున్నాడు".

"ఆ సమాచారం వెంకయ్యకు షాక్‌కు గురి చేసింది.

అబ్బ.. అంత దారుణానికి ఒడిగట్టాడా..?

ఎంతకు బరి తెగించాడు. నిన్నటి దాకా పెద్ద మనిషని, ఎంతలా గౌరవించాను, ఎంత మర్యాదగా చూసుకున్నాను. పనికి ఆహార పథకం సంజుకు తినమని 10 లక్షల రోడ్డిస్తిని. మంచిగున్న.. రోడ్లకే మళ్లీ ప్రపోజల్ పెట్టి శాంక్షన్ చేయిస్తిని. మట్టి చల్లి రోడ్డు అయ్యాయ నిపించినా బిల్లు లిప్పిస్తిని. ఇంకేం చేస్తారేవరైనా.. పచ్చనోటు వాసన చూపిస్తే చాలు దాని వెనక స్మశానికైనా వాళ్ళే రకం. ఇటువంటి వాళ్ళను పెంచి పెద్ద చేసినందుకు.. నన్ను నేను అనుకోవాలి. సరే అందరూ చిన్నగూడెం వదండి. బండ్ల తీయండి. ఆదేశాలు జారీ చేశాడు.

రెండు సుమోలు, రెండు కార్లు చిన్నగూడెం వైపు రయ్యన దూసుకు పోతున్నాయి. వేయికి పైగా ఓట్లున్న చిన్నగూడెం గ్రామంపై గట్టి పట్టున్న శివారెడ్డికి గాలం వేసి లాగగలిగాడు గజపతి. ఆ ఊరిలో శివారెడ్డి కుటుంబీకుల మాటను అంతా గీతలా భావిస్తారు. అందుకే వెంకయ్య గుండె మందుతోంది. కనీసం ఏడేనిమిది వందల ఓట్లు కళ్ల ముందు పోతుంటే మనసెలా ఊరుకుంటుంది.

వేగంగా వెళ్ళిన వాహనాలు ఊరి నడిబొడ్డున ఆగాయి. ఇంత రాత్రి కూడా ఓట్ల కోసం ఒట్లు వేయించుకుని, మందు, డబ్బు ఇచ్చే కార్యక్రమం కొనసాగిస్తున్నాడు శివారెడ్డి. ఆయన ప్రక్కనే గజపతి తన అనుచరు లతో ఉల్లాసంగా ఉన్నాడు.

వెంకయ్య వర్గీయులు దాడులకు పాల్పడేందుకు వచ్చినా దీటుగా ఎదు ర్కొనేందుకు గజపతి ముందే వ్యూహం రచించాడు. కర్రలు, కత్తులతో ఆవేశం గా ముందుకు ఉరికారు కాసేపటి తరువాత..

చిన్నగూడెం రక్తపు మడుగయింది. ఎంత మంది తలలు పగి లాయి లెక్కేలేదు. ఘర్షణలో వెంకయ్య అనుచరులు రమణ, యాదగిరి ఇద్దరి కుడి చేతులు తెగి పడ్డాయి. ఆరు నెలల తరువాత..రాష్ట్ర అటవీ శాఖ మంత్రి వెంకయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గజపతి. మండల పార్టీ అధ్యక్షులు శివారెడ్డిలు కలిసి వాహనం నుండి కిందకు దిగారు. రాజకీయం రంగులు మారింది. ఇప్పుడు మీరు ముగ్గురు ఒకే పార్టీ, మొండి చేతులతో రమణ, యాదగిరిలు వీరికి స్వాగతం పలికారు. అసలు ఎలక్షన్‌లు దేనికోసం? జనం కోసమా? నాయకుల కోస మో? పేదోడికి కూడు, గుడ్డ, నీడ కల్పిం చడం కోసమా? పెద్దోళ్ళ పదవులు పంచుకోవడం కోస మా? వాళ్ళ మనసు లో ప్రశ్నలు సుడులు తిరుగుతున్నాయి.

(జ్ఞులిత సంపాదక త్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)

ఆశాధరుడు

మనిషంటే..
సంతోషాలు, ఆనందభాష్పాలు
కష్టాలు, కన్నీళ్లూను
పొడుస్తున్న ఎండలూ
వాటిని ఆలింగనం చేసుకుంటున్న నీడలూ
కదలిపోతున్న నది కాలం
కరిగిపోతున్న కొవ్వతి ప్రాయలు
ప్రాయం కాలం రూపాంతరమే
నాదన్నది, నేన్నది తరచిచూస్తే వింత శూన్యమే
బహుశా
నీ నీడలా వెంటాడుతున్నది మృత్యు సైన్యం-
సూర్యుడు వెలుగును, వెచ్చదనాన్ని
చందురుడు వెన్నెలను, చల్లదనాన్ని
నేలతల్లి విలువ ఆధారాన్ని
చెట్టు ఆయువుని
తల్లిదండ్రులు
అనంత ప్రేమమయ అద్భుత జీవితాన్ని
మిత్రుడు స్వచ్ఛమైన మిత్రత్వాన్ని
గురువు అనంత జ్ఞానాన్ని
ఊరు ఊరంతా అభిమానాన్ని
సంఘం సామూహిక జీవనాన్ని ఇస్తున్నది.
ఏముంటుంది జీవితంలో
సమస్తమూ ఇవ్వడం తప్ప
కేవలంగా ఇవ్వడమే
ఏం మిగులుతుంది జీవితంలో
త్యాగమో అనురాగమో తప్ప
కల్మషం మెరుగని అంతరంగాల మధ్య
కట్టుకున్న అంతరాలన్నీ మిథ్యే
అనంత విశ్వం ఇవ్వడానికి
బంధీ అయిన కదులుతున్నది
నీ చుట్టూ ఉన్న
ప్రకృతి ఇవ్వడంతో బ్రతుకుతున్నది
మనిషికి వారసత్వంగా వస్తున్నది
దయార్ద్ర హృదయమే,
దాసగుణమే కదా-
అడిగో అడిగో బయలుదేరాడు
ఆశా ధరుడు
ఆగకుండా అడుగు అడుగు
కదిలిసాగిపోతున్నాడు
అహం అజానుభావుడు
సత్యం తప్పిన స్వార్థ జీవికి
అసలు తెలివిరాదు
మాయగప్పిన మనిషికి
అపశయ్య దాకా
మానవత్వం గుర్తుకురాదు-
మనం ఏం పట్టుకపోగలం?
కోటి ఉషస్సుల ఈ భూమి నుండి
మహా అయితే
మంచిదో చెడ్డదో
పేరును, ప్రేమను తప్ప
మనిషికి అతిసహజం జననం,
మరణం
మనిషిది మట్టి నుండి మట్టికి
మహా ప్రయాణం.
పుట్టినపుడు లేలేతగా ముడుచుకున్నా
పాడెకట్టినపుడు కట్టెగట్టినా..
ఖాళీ చేతులేగా
మంచితనాన్ని మమకారాల్ని
చచ్చే దాకా ఇచ్చేపోదాం.

-నల్లగొండ
83094532179

నా దేశం నా పవిత్రత

నా దేశం ప్రజ్ఞా పరిమళాల పూదోట
మానవ మనుగడకే స్ఫూర్తిదాయినీ
ఉన్నతైన హిమాలయ గంగాజల సెలయేళ్ళు
పచ్చని పైరులు వెచ్చని సంప్రదాయాలు అనుభూతి
పర్వాల ఆనందసందళ్ళు
విజ్ఞాన శాస్త్రాల వినోదవికాసాలు..!
భాషా సౌశీల్యం ప్రజ్ఞవికాషం
విశ్వవ్రేయరసపు వినమయసాధనం
వేదోశ్రేయరసపు వినిమయసాధనం
వేదోపనిషత్తులితహాస పుడమిగా
గీతామృతరసపు తన్మయత్వపు జననీ..!
జననం తపనం లాలిత్య మెలకువ
పరమాణువులలో పరమాత్మ దృష్టినీ
హరితలీలా సొబగు ఆనంద వర్థినీ..!
ఈ మట్టివాసన పీల్చితే కదా
పరిమళాల గుబాళింపు తెలిసేది
ప్రపంచాన ఏ సుగంధాలూ
ఈ మట్టి వాసనకు సరిపోవనీ..!
కాలధర్మ గతుల మనకే తెలుసు
తొలకరి చినుకులే
పులకరపు హరివిల్లు..!
ధర్మాచరణదీక్ష దండిదే మనరక్ష
భూతల్లి నీ తల్లి చూడాలి నీవెపుడు
దేశం దైవం దేదీప్యం మనిషిఇపుడు!
దేశసేవలోనే ఉంది జన్మ సార్థకం
ప్రకృతితో మమేకమే మానవీసుగుణం
దేశ పవిత్రతతోనే శుభసంకల్పంగ
సాగుసఫలం సుచరిత
సుందరమౌ మనభవితం
జైజై భారత్ జయహో భారత్..!

-డా.పాండాల మహేశ్వర్
9912180054

పుస్తక సమీక్ష

భగవద్గీతలోని మార్గ దర్శకాలు

నాటి నుండి నేటి వరకు కూడా భారతీయ ఆధ్యాత్మిక జీవనానికి భగవద్గీత ఒక 'గీటురాయి'. ఆధ్యాత్మిక జీవనమే కాదు. నిత్య జీవితంలో కూడా భగవద్గీత ప్రముఖ పాత్రనే పోషిస్తున్నది.

సుమారు 5000 ఏళ్ళక్రితము శ్రీ కృష్ణ భగవానుడు మహాభారత సంగ్రామ సమయాన కర్తవ్య విముఖుడై ఖేదించుకున్న అర్జునునకు భగవద్గీతనుపదేశించి ఆయనను యుద్ధమునకు సమాయ త్తము చేసి పాండవులకు విజయము చేకూర్చిపెట్టిన గొప్ప సంభాషణము. ప్రపంచ వ్యాప్తముగా కొన్ని వందల భాషలలో కొన్ని వేల వ్యాఖ్యానములు ఈ భగవద్గీతపై వెలువడినవి అంటే ఇది ఒక మహా గ్రంథము అనుటలో సందేహం లేదు.

చందకచర్ల రమేశబాబుగారు పరిణతి చెందిన గీతాధ్యాయి. లోగడ వీరు భగవద్గీతలోని కొన్ని అధ్యాయముల ప్రాశస్త్యతను వెలికితీసి **'త్రిగుణాలు'** అన్న పేరున ప్రకటించారు. ఇందులో మానవునిలో చెలరేగే సత్త్వతామస రజోగుణముల పై వివరణను ఇచ్చారు. తరువాత **'స్థిత ప్రజ్ఞత'** అన్న రెండవ పుస్తకాన్ని వెలువరించి పలువురి ప్రశంసలు శ్రీ రమేశబాబు పొందారు.

ప్రస్తుత పొత్తము 'నిత్యజీవన గీత'లో మానవుని దైనందిత జీవితములో ఉపయోగపడే ఎన్నో అంశాలను గీతలోని అనేక శ్లోకాలను ఉటంకిస్తూ వెలువరించిన 54 పేజీల చిన్ని పొత్తము. హేతువాదమే విశ్వ సూత్రమునకు మూలమని నమ్మే నేటి యువతరాన్ని ఉద్దేశించి వ్రాయబడినది.

'నిత్య జీవన గీత'లోని కొన్ని ముఖ్య అంశములు.

-కోట్ల ఏళ్ళ నుండి ఉదయిస్తున్న సూర్యుడు, జీవికనిస్తోన్న భూమి ఇప్పటికే నేటి కాలానికి కూడా ఎంత ఉపయోగకరమో, గీతలోని అంశాలు కూడా అంతే ఉపయోగకరము.

గీతలో చెప్పిన అంశాలు అన్నింటినీ చాందోగ్య ఉపనిషత్తులో శ్వేతకేతు ప్రశ్నకు జవాబుగా దొరికిన తత్వమసి (తత్, త్వం అసి)గా చెప్పవచ్చును. త్వం అనగా నువ్వు. తత్ అనగా సాధించవలసిన చివరి మెట్టు లేదా గురి. 'అసి' అనగా భవిష్యత్తు.

-గీత వల్ల ఒక మనిషి ఏమీ తెలియని అజ్ఞాన దశ నుండి కర్మ, ధ్యాన, సన్యాస, యోగములనే సోపానముల నెక్కి చివరకు చేరుకోవలసిన పరమాత్మను చేరుకుని కర్తవ్య నిర్వహణలో పరిపక్వత పొంది విజయాన్ని సాధిస్తాడు.

-కొన్ని మతాల్లో ప్రవచించినట్లు- 'ఇలా చేయి' అని నిర్దేశించకుండా, ఏమి చేస్తే ఏమి జరుగుతుందో వివరించి ప్రజాస్వామ్య పద్ధతి (Democracy) లో గీత చెబుతుంది.

-మన నిత్య జీవన విధానం 4 రకాలు.అవి 1 భౌతిక 2 మానసిక 3 నైతిక మరియు 4 పారమార్థికము.

- ఫలాపేక్ష వదిలి- విహిత కర్మలను ఆచరించాలి. కౌశలంతో కర్మలను ఆచరించటమే 'యోగ'.

-'సృష్టి' అంతా భగవంతుడిది. మనుష్యులుగా మన కర్తవ్యాన్ని నిర్వర్తించటానికి పుట్టిన తాత్కాలిక అతిథులం మనం. అందరూ తమ తమ విహిత కర్మలను ఆచరిస్తూ ఉత్తమ గతుల్ని పొందాలి. అంటే నిత్యం ఉత్తమ కర్మలను ఆచరించటే మనం ధ్యేయంగా పెట్టుకోవాలి.

భగవద్గీత ఒక అనంత రత్నాకరము. శోధించిన కొద్దీ అమూల్యమైన రత్నాలు ఎన్నో దొరుకుతాయి.

అట్టి శోధనతో కొన్ని రత్నాలను అందిస్తున్న రచయిత శ్రీ చందకచర్ల రమేశ్‌బాబు కు అభినందనలు. వీరిలా ప్రయత్నించి మనమూ కొన్ని రత్నాలను సేకరిద్దాము.

ముందు ముందు రచయిత ఈ రత్నాకరమును శోధించి మరిన్ని రత్నాలని అందిస్తారని ఆశిద్దాము.



ప్రతులకు: చందకచర్ల రమేశబాబు
బాదంగ్‌పేట్, హైదరాబాద్.
సెల్: 80089 88044

- కూర చిదంబరం
సెల్:8639338675

చిక్కిపోకు
మోసపోకు
రాజకీయాకర్షణలకు లొంగిపోకు నోటుకు ఎన్నడూ అమ్ముడుపోకు
-కోటమహంతి వెంకటరావు(కోవెరా), విశాఖపట్నం

సహనం
గహనం
శీతకాలం వస్తూనే విరుస్తుంది ధవళవర్ణపు తుహినం
-విన్నకోట ఫణీంద్ర, హైదరాబాద్

రమణీయం!
స్మరణీయం!!
బాపు చూపిన మార్గమే సదా అనుసరణీయం!!!
-ఎమ్మెస్సార్ భార్గవి ప్రియ, విజయవాడ

చీలికలు .పేలికలు
ఎన్నికల్లో
తప్పులతో జనాలు కరుచుకొన్నారు నాలికలు.
శ్రీమతి ఎస్. కమలా దేవి, హైదరాబాద్.

అవంతి
జయంతి
భారతదేశం వివిధ రకాల సంప్రదాయాల స్రవంతి!
-పప్పు సుజాతారావు, వైజాగ్

స్ఫూర్తి
సంవర్తి
ఏ కార్యక్రమమైనా మొదలెట్టాక చేయాలి పూర్తి
-డా.రమ్య స్వరూప్, హైదరాబాద్

వచనం
నిర్వచనం
వేదికపై రెంటినీ కలిపితే అవుతుంది ప్రవచనం.
-మాధవపెద్ది ఉష హైదరాబాద్

జీవనము
పావనము
వక్రమార్గాన్ని అనుసరిస్తే ఒకనాటికి చూడకతప్పదు కాననము
-దబ్బీరు ప్రభాకర్, రాయపూర్.

ప్రమాణములు
పరిణామములు
నిజాయితి నిబద్ధతగల మంచి వ్యక్తిత్వానికి ప్రణామములు
**-

బతుకు చట్రం

మనసుకు ముళ్ళు గుచ్చుకున్నవి,
ఉడుకుడుకు ఉల్లిగడ్డ కట్టి,
బయటికి తీద్దామంటే,
దానికంటూ ఓ చోటు లేదాయే!
నల్ల చారలు ఉన్న కుక్కొక్కటి,
కాళ్ళు కాలిన పిల్లోలే తిరుగుతున్నది.
దానికంటూ ఉంటానికి ఓ గూడు లేదాయే!
అసలే చలికాలం ?
నేలని కొంతమేర తవ్వి,
నాలుక్కాళ్ళూ ముడుచుకుని పందామంటే,
ఓ రెండడుగుల నేలైనా తనది కాదాయే!
అవే నల్లని చారలు ఉన్న పిల్లి ఒకటి,
మ్యావ్, మ్యావ్ అనుకుంటూ,
ఓ ఇంట్లోంచి బయటికొచ్చింది,
తనకంటూ ఓ ఇల్లుంది.
ఒకటేంటీ, చాలానే ఉన్నాయి!
ఏ ఆదివారం నాటి మధ్యాహ్నమో ?
ఎవరో ఒకరు చికెన్ ముక్క ఒకటి,
తన మొఖాన కొట్టకపోతారా?
అని దేవులాడుకుంటూ తిరుగుతది.
నాకన్నా పిల్లి బతుకే నయం అనుకుంటూ,
కుక్క – ఆ పిల్లికేసే ముక్కల మీద
కన్నేస్తది.
బౌవ్ బౌవ్ అరుపులతో
ఆ ముక్కలన్నీ కడుపులేసుకుంటది.
ఈ బతుకు పోరాటంలో ఒక జీవి –
ఇంకో జీవికి శత్రువే!
ఒక కడుపు నిండితే –
ఇంకో కడుపు పస్తులే!
ఇదే బతుకు చట్రం,
జీవిత రేఖల్ని చీరే అస్త్రం!



–బాలాజీ పోతుల
8179283830

అత్యవసరమైన గ్రంథం "యోగ: సర్వరోగనివారణ

ఇదొక విశిష్టమైన మరియు ప్రతి ఒక్కరికీ ఎంతో అత్యవసరమైన గ్రంథం గా చెప్పుకోవచ్చు.. నేడు మనిషి ఆరోగ్యంగా వుండాలంటే 'యోగ' తప్పనిసరిగా మారింది. చేతినిండా పనిలేక తెచ్చుకున్న తంటా ఇది. ఒకప్పుడు ఇంటిపనులు చేసుకుంటూ వుంటే అదే యోగా లా పనిచేసి శరీరాన్ని కాపాడుతూ వుండేది. నేడు ప్రతీదానికీ యంత్రాలపై ఆధారపడి చేతినిండా పనిలేకుండా పోయింది. అంతా స్విచ్ వేయడంతోనే అయిపోతోంది. అదీ కాక పనిలేకున్నా కడుపునిండా తినడం తప్పయిపోయింది. పనిని బట్టి ఆహారం అనేది మానేసి తినడమే పనిగా పెట్టుకుంటే కొంతకాలానికి ఎపుడు ఏది తింటే ఏమవుతుందో అనే భయంతో బతకాల్సి వస్తోంది. . దీంతో తిన్న ఆహారం అరగకుండా కొవ్వుగా మారి ఎటు చూసినా అనారోగ్యం, వ్యాధులు, వైరస్ అటాక్‌లు శరీరాన్ని శుష్కింపజేస్తున్నాయి. సామాజిక అసమానతలు హింసాప్రవృత్తి పెరిగిపోవడం బాంధవ్యాలు దెబ్బతినడం వంటివి మానసిక వైకల్యాలకు దారితీస్తున్నాయి. ఇవన్నీ చాలవన్నట్లు కాలుష్యపు కోరల్లోకి చేరుకుని జీవితం అర్థాంతరంగా ముగిసిపోవడం జరుగుతోంది. వీటికి తోడు మెడికల్ మాఫియా ఒకటి సామాన్య జనజీవనాన్ని అతలాకుతలం చేస్తోంది. వ్యాధి ఒకటైతే వాడే మందులు దాదాపు పది దాకా వుండటం, మార్కెట్లోకి కొత్తగా వచ్చిన యాంటీ బయటిక్స్‌ని ప్రయోగం చేయడంకోసం రోగులకు అవసరం వున్నా లేకున్నా ఎక్కువగా ప్రిస్క్రైబ్ చేయటం, డాక్టర్ పై నమ్మకంతో సదరు వ్యాధి వున్నవారు వాడటం మూలంగా కిడ్నీలు పాడవ్వడం లేదా గుండె పనితనం నెమ్మదవ్వడం, అతి నిద్ర, లేదా నిద్రలేమి వంటి కారణాలతో అనేకమంది తమ జీవితాలను అయోమయంలోకి నెట్టేయడం జరుగుతోంది. ఈ అతిగా వాడుతున్న ఔషధాల కారణంగా అతి తక్కువ వయసులోనే మెదడులోని రక్తనాళాలు చచ్చుపడిపోయి, ఆల్జీమర్స్ వ్యాధిన పడటం జరుగుతున్న విషయం చాలామందికి తెలియదు.

ప్రతులకు :
సూర్య యోగ ఫౌండేషన్,
డాక్టర్ లుగేంద్ర పిల్లై
ఫోన్: 83175 04224

ఒకప్పుడు ఒక వ్యాధి బి.పిగానీ, షుగర్ కానీ ఏదయినా రావాలంటే కనీసం నలభై ఏళ్ళు వచ్చివుండేది. ఇపుడు పుట్టిన బిడ్డనుండి ఈ వ్యాధులు రావడం, వాటికోసం అవసరానికి మించిన ఔషదాలు వాడటం ద్వారా మరి కొన్ని జబ్బులు రావడం జరుగుతోంది. ఇలాంటప్పుడే చాలా మందికి 'యోగా' ధ్యానం వంటివి అలవాటు చేసుకోవాలని, మనిషి మానసిక స్థిరత్వానికి, శారీరక దృఢత్వానికి ఎంతో దోహదం చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా యోగా సెంటర్లు వెలిసాయి. జిమ్ములు వెలిసాయి. వేలకు వేల డబ్బులు కట్టి చేరడం తప్పడం లేదు. ఇన్ని చేస్తున్నా ఇంకా ఎక్కడో వెలితి. అనారోగ్యం. మానసిక రుగ్మత కు మనిషి దూరమవ్వటం లేదు. అసలు శరీరమే ఆరోగ్యంగా వుంటే మందులు ఎందుకు? బాల్యం నుండి ఆటలు ఆడటం, శారీరక శ్రమ చేయటం లేకపోవటంతో యోగాసనాలు, వ్యాయామం చేయడం ద్వారా ఒత్తిడి నుండి బయటపడి అనారోగ్యం గా చెంతకు రాదు. కాబట్టి శారీరక ఆరోగ్యం కొరకు 'యోగాసనాలు' వుద్వేగాలను నిలువరించడానికి ప్రాణాయామాలు, మనసును ఒకచోట నిల్పడానికి ధ్యానం చేయాల్సిందేనని ఇలాంటి పెద్దలు, పరిశోధకులు చెబుతున్నారు.

మనసు-బుద్ధి- శరీరం అన్నింటినీ సమన్వయంతో కలిసి నడిస్తేనే మనిషి జీవితం రాణిస్తుందని డాక్టర్స్ చెబుతుంటారు. యోగా సంపత్ కుమార్ గత నాలుగు దశాబ్దాలుగా సమాజ ఆరోగ్యం కోసం కరాటే మాస్టర్ గా, యోగాచార్యగా, సంగీత సాహిత్య, యోగ శాస్త్రాలన్నీ పరిపూర్ణంగా నిక్షిప్తం చేసుకుని బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణిస్తున్నారు. ఆరు పదుల వయసు దాటినా నిత్యం ఆరోగ్యంగా కనిపిస్తుండటం మనం గమనిస్తున్నాము. ఈ క్రమంలో ప్రస్తుత గ్రంథంలో ఎంతో విలువైన విషయాలను, అవసరమైన సలహాలను అందించడం జరిగింది. అదీ కాకుండా వేలకొలది గ్రంథాలను

పునశ్చ సమీక్ష

అధ్యయనం చేసిన పరిజ్ఞానంతో, వ్యక్తిగతంగా వందలాది గురువుల నుండి పొందిన జ్ఞానంతో ఈ గ్రంథం రూపొందించబడిందనే ఈ గ్రంథ కర్త తెలియజేయడం ద్వారా ఈ గ్రంథం విలువ మరింత పెరిగింది. ఇప్పటివరకు వీరు ఆరోగ్య యోగా, యోగాసాధన, యోగాతో నవయవ్వనం, అనునిత్యం యోగా, యోగిక్ కేర్ అండ్ క్యూర్ వంటి దాదాపు నలభై గ్రంథాలు అందించడం ద్వారా యోగా ద్వారా సర్వ వ్యాధులు నిరోధించవచ్చు అని రచయిత సమాజానికి తెలియజేస్తున్నారు.

ఈ గ్రంథంలో ప్రతి పేజీ విలువైనది. ఎంత పరిశోధన చేసివుంటే ఇంతటి గొప్ప గ్రంథాన్ని తేగలరని అనిపిస్తోంది. ఈ గ్రంథం సమాజానికి అందించడం మహాభాగ్యంగా భావిస్తున్నాను. ధృడచిత్తంతో పాటు దృఢ శరీరం వున్న వారే సార్థక జీవనం గడపగలరు అన్న స్వామి వివేకానంద వారి మాటను అనుసరించి రచించిన ఈ యోగ చికిత్స విధానంలో ఇంత కూలంకుషంగా తెలుగులో ఏ గ్రంథం రాలేదని, ఆ కొరతను తీర్చడానికే వచ్చిందని, తరతరాలకు మార్గదర్శకంగా నిలస్తుందని చెప్పగలను. వీరి కృషికి నిదర్శనంగా జాతీయ స్థాయిలో పలు ప్రతిభా పురస్కారాలు, అవార్డులు, సన్మానాలు అందుకున్న వీరికి నా హృదయపూర్వక అభినందనలు. తప్పకుండా ఈ గ్రంథం ప్రతి ఇంట్లో వుండవలసినదని ఖచ్చితంగా సూచిస్తున్నాను.

–శైలజామిత్ర
9290900879

సవారు కచ్చురం

ఊరు బందుకు రాంగనే
ప్రకృతే పరవశం పొందినట్టు
సహజసిద్ధమైన సంగీత ఝురి
లయబద్ధమైన కాలిడెక్కల సవ్వడి
పరిగెడుతున్న ఎడ్ల మెడలో
ఊగే గజ్జెల పేర్ల
సరిగమల నాదాలు
సవారీ కచ్చురాల పెరుగుల
ఇంపైన నాదాలు చెవికి సోకినంతనే
ఏదో తెలియని అవ్యక్త భావాలు..
నా చిన్నప్పుడు తీర్థాలు, పెండ్లిళ్ళపోవుడు
మస్తు సంబరంగా ఉండేది
సవారు కచ్చురంల పోవుడంటే
పైనంబోవడానికి మూడు రోజుల ముందే
గిరిలిప్పేటప్పుడు ఉపకారివెట్టి
నొగలమీద కూసుండబెట్టి
ఇరుసుకు జనుమేసి కందెనపూసుడు
కాని తాడు గట్టిగా కట్టుడు
పట్టు కనాలు, దోత్తెలు సవరిచ్చుడు
దూలశీల, గిరెల శీలలు చూసుకుని
సవారు కచ్చురాన్ని సక్కదనంగా తయారు జేసుడు
సవారు కచ్చురమెక్కి పోవుడంటే
ఉల్లాసం ఆగుతదా మల్లా..
పైవట్టి ఉరుకుట్ల ముందుండే జోరెడ్లు
మా అర్జునుడు, భీముడు
మెడ మీద కానివెట్టి ఊ..అని
పగ్గాలు కొద్దిగా గుంజి సల్లిడిత్తెజాలు
కదసంగాన దూకె ఏరయోధుల్లా
ముంగటెన్ని బండ్లున్న ఎనకేసి
ముందుకురుకుతయి
కుపెద్దకైన, ఉరిపెద్దకైన
మోతుబరి రైతుకైన సవారికచ్చురి
పెత్తాననికి ప్రతీక..
ఇప్పుడు సవారి కచ్చురం లేదు, గజ్జెల సప్పుడులేదు
నా చిన్నప్పుడు మా సోపతిగాళ్ళతో
బండ్లెకూసిండి ఆడుకున్న
మా పొత్తుల సవారుకచ్చురమిప్పుడు
మా పెద్దన్న పాలుకుపోయి
ఇంటి అటుకుమీద జీర్ణావస్థలో
మూగవోయి కనవడిన
సవారు కచ్చురం
నా చిటికెనవేలు పట్టుకొని
నా బాల్యపు దారులవైపు
నడిపించింది.

–కొమురయ్య బాలసారి
సెల్:9912657877



ఎందరే కారణంగా వచ్చి చేరినా
విశ్రాంతంగా ఉండేందుకు సరిపోయే
వసతి కల్పించే పుష్పక విమానమయ్యేది!

ఎవరే సమయాన ఇంట కాలిడినా
ఆదరాభిమానాలతో ఆహ్వానించి
'ఆకలి తీర్చే అక్షయపాత్రయ్యేది!

ప్రేమ గుబురు కొమ్మల చల్లని నీడతో
సేదదీర్చి.. ఏ సమస్యనైనా
పరిష్కరించి ఆదుకునే న్యాయసదనమయ్యేది!
స్థిరంగా భూమిలో ఊనుతున్న వేళ్ళతో
దిట్టమైన కాండపు కాయంతో
కట్టు సడలని అనురాగపు ఊడలమర్రి అయ్యేది!

సమాజానికి వెన్నుదన్నుగా నిలిచి
సహకార సమృద్ధిలో భాగమై వెలుగుతూ
విలువల పెన్నిధిగా విరాజిల్లేది
నాటి ఉమ్మడి కుటుంబం!

ఇల్లెంత విశాలమైనా
ఇరుకు మనసులతో ఊపిరాడక
అతిథి అభ్యాగతులు మటుమాయం!

భర్తని బిడ్డల్ని తప్ప.. వేరెవరి నీడని
భరించలేని ఇల్లాలి ధోరణి కారణంగా
ఇంటి పెద్దల మకామయ్యింది 'ఆశ్రమం!'

ప్రబలమైన ఈర్ష్యాసూయల బెడదకి తోడు
దినదిన ప్రవర్ధనమాన మౌతున్న
అసహనపు చీడతో
కుదుళ్ళు కదిలి కూలనుంది..
నేటి చిక్కిపోయిన చిరు కుటుంబం చెట్టు!

మనసు మూలల్లో మిగిలిన మమతల చెమ్మల్లో
ఒకింత త్యాగం కలిసిన మంచిదనపు మట్టిని నింపి
అహం విడిచి అనుబంధపు మొలకల్ని నాటుదాం!

అంతరంగాలనిండా ఆప్యాయతాతీగల్ని అల్లించి
మైత్రీ మారాకుల్ని శ్రద్ధగా పోషించి
'కుటుంబం' చెట్టుని బలోపేతం చేద్దాం!

– ఎస్. కాశింబి
సెల్: 9052216044

కుంభమేళ

జన వసంతం ఎక్కడున్నా
ఓ సంబరమే ఓ సంరంభమే
ప్రపంచంలో
అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క సారలమ్మ
జన జాతర కుంభమేళ
కులాల కట్టలు లేవు
కుతంత్రాలు ఎగదోయాల్సిన అవసరం లేదు
దేశం
వైవిధ్యంలోనే తనను తాను దర్శించుకుంటుంది
ఎక్కడైనా నలుగురితో కలవటమే జీవితం–
జీవితాన్ని చూడటం
వెలుగుల్లోకే చీకట్లలోకి కాదు
అంతరాంతరాల్లోని
వెలుగునంతా చూపెట్టే కుంభమేళ
చీకట్లను నింపే కళ్లద్దాల్ని పక్కన పడేయండి
మూస భాషనలను మురుగులో వేసేయండి
జనాన్ని చూడండి
ప్రపంచం జనాభా అంతా
ఒక్కచోటే ఉండటం ఒక్కటే కావటం చూడండి
కవిత్వంలోని ప్రతీకలన్నీ
ఒక్కచోట కుప్ప పోసి చూస్తే
కనిపించేంత జనసంద్రం
జీవితం అంతటికి సరిపడా
తర్వాతి జీవితాల్నిండా కూడా
వెలుగుల్ని నింపేంత జ్ఞానకాంతి
ఒక్కసారి కళ్ళు తెరిచి చూడండి
రామన్ అమావాస్య నాడు
సముద్ర స్నానం చేస్తే
అతని ఎఫెక్ట్ ఏమైనా పక్కకెళ్ళిందా?
కుంభాన్ని తలలో తలుచుకోండి
కుంభంలో తలపెట్టి చూడండి
కుంభంలో తల పట్టడం లేదంటే
తలను చిన్నదిగా చేసుకోవడం కాదు
కుంభాన్ని పెద్దగా ఆలోచించండి
లక్షలాది వృత్తుల కోట్లాది సమూహాలను
ఒక్కచోట చేర్చే
వసుధైక కుటుంబ సంబరం కుంభమేళ
నిరంతరం పంచబడే వెల్తురులో
స్నానం చేయిస్తుంది
వెలుగుల వెంట దారి చూడండి
జనాన్ని అజ్ఞానం చీకట్లలోకి తీసుకెళ్లకండి
సూర్యుడే జ్ఞానసేత్రం
మలినమైన మస్తిష్కాలు కాదు–
ఒకచోట నగ్నకూటములు
నాగరికత మూలాల్లోకైతే
ఇక్కడ
జీవితాల్ని నగ్నంగా దర్శించడంలోని
దార్శనికత
మూఢత్వామవ్వటమంటే
పుచ్చు కళ్ళ బీబీసీ యే ఔతుంది
చీకట్లతో నిండుకున్న
అజ్ఞాన వేదికల్లోంచి అరవడం కాదు
కనిపించనంత అనంతాగ్నిని దాచుకున్న
లోతుల్లోకి దర్శించండి
జ్ఞానం
చీకట్లను
మబ్బుల్ని చీల్చుకునే వెలుగుతుంది
మిరుమిట్ల జనకాంతిని తట్టుకోలేకపోతే
తలదించుకొండి
ఒప్పుకోకపోతే
ఆవిష్కృతమయ్యేదాకా
అరుస్తూనే ఉండండి–

–జి. నరసింహస్వామి
సెల్:9441041475

కర్మయోగి!

పనే పనిగా చూట్టం తెలిసినవాడు
పనినే దైవమని నమ్మినవాడు
చెరగని చిరు దరహాసంతో
ఛెంగుఛెంగున పరుగెత్తుతాడు పని కోసం
పురమాయించిన పనిని పూర్తిచేయందే
విశ్రమించని కర్మయోగి
అందరికీ తలలో నాలుక
వాద వివాదాలు తెలియని
ఏనాడు శృతిమించని అమాయకజీవి
ఎలకోయిలల తీయని పాఠాలు
నిత్య వసంత శోభలు చుట్టూ
అమాయకపు అల్లర్ల చిలిపిదనాల
వసివాడని పసిలోకం పిలుస్తున్నట్టు
మనసుదోచే హరితమయ
అందాల కన్నులు విరబూసి
రమ్మంటుంది అతని అన్నుల ప్రాంగణం
నిత్యబోధకులు, సత్య సాధకులు
ఎందరోత్యాగమూర్తులు,
మరెందరోఅనురాగమూర్తులు
వాళ్ళు నడయాడిన చరితెంతో ఘనం
మహావ్యక్తిత్వాల్ని,మూర్ఖ మనస్తత్వాల్ని
అక్షరం ముక్క రాకున్నా
ఆకలింపు చేసుకున్నాడు
ఏన్నో సమావేశాలు,
ఏవో ఉవ్వెత్తున ఎగసిన ఆవేశాలు
అతను ఆసాంతం ఎన్నని ఆలకించలేదు?
స్వాగతాల' సందడిక్షణాలను ,
వీడ్కోళ్ళ అశ్రుకణాలను
ఆప్తుల బదిలీలు, పదవీ విరమణలు
రాయబడిన ఆనందాలు,
గాయపడిన క్షణాలు
అతని జీవితానుభవంలో
ఇంకా ఎన్నని చూల్లేదు ?
అది నుండి అతనే
వీటన్నింటికి సజీవ సాక్ష్యం
కోటి ఊసులు శంఖమూదగల
హృదయం
అతను
కోటి వేదనలు మృదంగమై
మ్రోగగల హృదయం అతను
మూలవేతనం డి.ఏల నిరసన,
అలకల్లేని , పీఆర్సీల గొడవల్లేని
గౌరవ వేతనంతో సగౌరంగా
వెలుగుతున్న వినయుడు
ఆ చదువులబడికే అంకితమయిన
విశ్వసనీయుడు
అతని విధి నిర్వహణలో
సమస్యలు,సంఘర్షణలు హోరెత్తే కెరటాలు
సవాళ్ళ ఒత్తిడి
సుడిగుండాలు అతనికేం క్రొత్తగాదు.
కోవెలగా కోలాహలమై వున్నా
నిర్మానుష్యమై వెలవెలబోతువున్నా
పనినే నమ్మిన నిస్వార్థుడు
జీతం గురించి
జీవితం పట్ల ఏ బాధలేని
మధురమైనది అతని బతుకు బాట
నాకు తనివితీరని మనసైన పాట
మరలా నేనీ పూట
పల్లవీ ,చరణాలుగా.. పాడుకుంటున్నాను.

–రమేశ్ నల్లగొండ

స్వామి వివేకానంద

శాంత గంభీరవదనం
భారతీయవేషభూషణ సౌందర్యం
సకలకళా తేజో రూపం
చైతన్యతరంగ స్వరూపం..
అతడే
భారతీయ నందనుడు
నరేంద్రుడు..

పురాణ ఇతిహాసాలు
సనాతనసంప్రదాయాలు
నమ్మకాలు..
నిరంతర జ్ఞానాన్వేషణ
తార్కిక మేదోమథనం
ప్రశ్నగా వివేకం..
సమాధానమైనఆధ్యాత్మికం..
రామకృష్ణవివేకానందుల
సమావేశం..
విశ్వజాతికి విజ్ఞాన ప్రసాదం..
విశ్వవేదికపై సకల మత సమ్మేళనం..
సకలమత మిళిత సారం..
సర్వధర్మాలసారాంశం..
ఉదాత్త ఉత్తేజిత
భావ ప్రసంగం..
ఆలకించి పులకించిన సభ
తన్మయామోద
కరతాళ స్వాగతాలు
విశ్వసౌభ్రాతృత్వం
మానవతా సందేశం
భారతీయ తత్వమై
విశ్వవీధిన విహంగ విహారం..
జాతికి మేల్కొలుపు పిలుపు
జాగృతమై – చైతన్యా కృతిగా
– సందిగ్ధ సంకోచాలుదాటి
బలహీనతలు వదిలి
సత్యం – ప్రేమ – నిజాయితీ –
ఆత్మ శక్తితో..
యువతరం నవతరం లేచింది..
సనాతన అధునాతన
సమాగమ జ్ఞానం
రామకృష్ణ ప్రభలతో
వివేకానంద జ్యోతియై
విశ్వజనీన విలువలతో
అఖండమై,అజరామరమై,
ఉత్సాహతరంగితమై,
యువజనోత్సవమై..
భారతీయ గురుత్వమై
ప్రకాశితమౌతూనే ఉంది.

–గడ్డం సులోచన
7702891559

తాళాధిరోహణ న్యాయము

తెలుగులో "గుర్రాన్ని చెరువు దాకా లేదా నీళ్ళదాకా తీసుకొని పోతాం కానీ నీళ్ళు తాగించలేం" అనడం తరచూ నిత్య జీవితంలో ఉపయోగిస్తూ ఉంటాం.

తాగాలనే బుద్ధి, కోరిక దానికి లేకపోతే దాని మూతిని నీళ్ళలో ముంచినా అది ససేమిరా తాగదు.

ఈ న్యాయమును ఎక్కువగా విద్యార్థులకు అన్వయిస్తూ ఉపాధ్యాయులు వాపోతూ ఉండటం పరిపాటి.

కరోనా అనంతరం విద్యార్థుల వైఖరిలో అనూహ్యమైన మార్పులు వచ్చాయి.ముఖ్యంగా చదువంటే నిర్లక్ష్యం ఏర్పడింది. తనకు నచ్చిన విషయాలను తప్ప మిగిలిన వాటిని తేలికగా తీసుకునే మనస్తత్వం అలవడింది.

సెల్ ఫోన్లలో గేమ్స్,బెట్టింగ్స్ లాంటివి ఆడటం, విషయ పరంగా చూసి నేర్చుకోవలసినవి, డౌన్ లోడ్ చేసుకొని రాయాల్సినవి పక్కన పెట్టి, అనవసర దృశ్యాలను చూస్తూ మనసు శరీరాలను పాడుచేసుకుంటున్నారు.

అలాగే వారిలో పెరిగిన బద్ధకం, నిర్లక్ష్యంతో పాటు భావోద్వేగాలపై అదుపులేక పోవడం వల్ల లక్ష్యంపై ఉన్న శ్రద్ధాసక్తులను సాధనలో చూపించలేక పోతున్నారు.

అలాంటి వారిని మార్చే ప్రయత్నం "బూడిదలో పోసిన పన్నీరు" లా అవుతోంది.

కాబట్టి స్వతహాగా మనసులోనూ ఆచరణలోనూ లక్ష్యం, సంకల్పం లేని వ్యక్తులను మార్చలేని స్థితిలో తాళాధిరోహణ న్యాయమును ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

అందుకే మన పలుకుబడి ఉపయోగించి వాళ్ళను ఉన్నత స్థాయిలో చూడాలనే కోరిక కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసం పెంచి తద్వారా సర్వం సాధించగలం అనే నమ్మకం కలిగేలా చిన్నప్పటి నుండే శిక్షణ ఇవ్వాలి.

–పురిమళ్ల సునంద
9441815722

సునందామృతం

తాళము అంటే తాడి చెట్టు. అధిరోహణము అంటే ఎక్కడం.

తాటి చెట్టు ఎక్కే వ్యక్తిని చేతికి అందినంత వరకే పైకి ఎగదోస్తాం కానీ అటుపైన ఎక్కే సామర్థ్యం అతడికి ఉండాలి.అలా లేకపోతే చేసేదేం లేద్దు అనే అర్థంతో ఈ తాళాధిరోహణ న్యాయ మును ఉదాహరణగా చెబుతుంటారు.

దీనినే

కోరికల తరాజు

తిరగేయని పేజీలెన్నో?
రాయని కథలెన్నో?
తీరని వెతలెన్నో?
కంచికి చేరాలని
తపించివిపోతున్నాయి.
మాయలేనంత
భారంగా మారింది
హృదయం...
ఒక్క తనువుకేనా
డైటింగ్ మంత్రాలు,
మరి కోరికల చిట్టాకు లేవా
ఘా మంతర్లు?
తీరని కోరికల దాహం
మనసుది...
చేతిలో ఉన్న దాన్ని
పక్కన పెట్టేసి
నిత్యం కొత్తదానికై
మనలోని నేను
తొలుస్తూనే ఉంటుంది.
అవసర,అనవసరాలను
తూచడానికి
పాతాళంలో కూరుకుపోయిన
తరాజును వెలికితీయి
రేఖామాత్రం బరువైనా
దిగుతుందేమో!

–డాక్టర్ దుగ్గి గాయత్రి రంగరాజు

అనగలరా ఎవరైనా..!

సమస్యలు సంగమించిన వేళ
దుఃఖపుటేరులు స్రవిస్తూ
సముద్రాలై ఎగుస్తుంటే..
అనగలరా ఎవరైనా కాలం అబద్ధమని..!!.
ఆకలి చిచ్చు కాలుస్తున్న పేగులు
తడి ఎండిన గొంతులతో
కంటినుండి సెగలను చిమ్ముతుంటే..
చెప్పగలరా అంతా ఉత్తిదే అని..!!.
కలిసి వుండే మనసులు కళలు తప్పి
దూరాలకు తలుపులు తెరిచి
నిర్జీవ పాత్రలుగా నడయాడుతుంటే..
సాహసం చేయగలరా సర్దుకోమని..!!.
అలుముకున్న మోహావేశాలు
అధర్మాలకు నెలవులు కాగా
జీవితాలను ఛిద్రం చేస్తుంటే
శిక్ష లేదంటారా ఘోర నేరాలకు..!!.
ఆస్తుల కోసం చేతులు చాపి
కన్నవారి గుండెలు అవిసిపోగా
ఆశ్రమాల బరువును పెంచుతుంటే
వదిలేయమంటారా ఇంకా జాలిపడి..!!
విడివడిన మనుషుల బంధాలు
వర్గాలకు విలువలు పెంచి
రక్త దాహాన్ని తీరుస్తుంటే
ఆపగలరా అవినీతి దారుల ఆగడాల్ని..!!
ఆగని జీవన చక్రంలో జరిగే నిజాలకు
మిగిలిన నీ కాలపు విలువ ఎంతో...?
తెలుసుకునే తెగువ ఉంటే
మారి చూపించు మనిషిగా..
మనసు శిల కరుగుతున్న కరుణగా....!

–అరుణ ధూళిపాళ

వినియోగదారుడు

వినిమయ లోకం ఓ మాయ
ఆ లోకంలో అతడో బోయ
అడుగులో అడుగు పడితే తోవ
అతనితోనే ఆర్థిక చక్రానికి చేవ!.
వినిమయం అనే గడియారంలో
సేవలు అనే అంకెల చుట్టూ
సెకను నిమిషం గంటల ముల్లె
తిరుగు వాడు వినియోగదారుడు!.
మూడు ముళ్లు ముఖ్యమే
ఒకటి కదిలితే మరో దానికి విలువ
గడియారం అన్నప్పుడు
తిరిగితేనె కదా సమయం తెలిసేది!
వినిమయ వస్తు లోకానికి
వినియోగదారుడే ఇంధనం!
జగత్ రథ ఇరుసు కందెనై తరుగుతు
జగాన్ని మెరిపించువాడతడు!
అమ్మకాలు కొనుగోలు
బావిలో బొక్కెనేసి చేదుకోలు
వినిమయ ప్రపంచానికి
వినియోగదారుని తోనే వేడుక!
తాను వత్తి యై కాలుతు
దీపం లో వెలుగు నింపుచున్న
వినిమయ భారాన్ని మోస్తున్న
మరో అవతారమే వినియోగదారుడు !

–పి.బక్కారెడ్డి, 9705315250

రెక్కలు

కొందర్ని
ఏదీ కదిలించదు.
కొందర్ని
ఏదీ బాధించదు.
ప్రతిస్పందన
జీవలక్షణం
దులపాలి
తరచూ
ఇంటినీ ఒంటినీ
మనసులో మకిలినీ
ప్రక్షాళనే
పరివర్తన

–పి.శ్రీనివాస్ గౌడ్
9949429449

ఎవరి చెమట చుక్కలో

రోజంతా మోసిన కష్టాన్ని
రాతిరి దిమ్మెపై
కంటి పాప కునుకులో దించి
అలసట తీరి నిద్రిస్తుంటే
కాకి నోటితో చప్పట్లు కొడుతూ
గోడమీద అల్లరి చేస్తుంది
దానికి రోజు ఉదయాన్నే
నా అర్ధ భాగం గింజలు పోసేది
ఆలస్యమైనందుకేమో
అమ్మ అన్నం పెట్టు అని అరుస్తుంది
గుండెకు వినిపించేటట్లు
దానికి మాకు గింజలు మంచి
సంబంధాన్ని అల్లినవి
ఎవరి చెమట చుక్కలు తాగి
ఎదిగినవో గాని
గింజలు కంచుడు లో పోస్తుంటే
చూసి మురిసిపోతూ
ఆలస్యం అయింది
ఎందుకమ్మా అని అడుగుతుంది
మౌనంలో నవ్వుతూ
కాలం కొత్త సంవత్సరాన్ని
తెచ్చింది కదమ్మ
దానితో మంచి చెడ్డలు
మాట్లాడడం వల్ల
ఆలస్యమైందని చెప్పింది
అమ్మ చేతి మీద వాలి
ముద్దు పెట్టి
గింజలు తిని
అలా తిరిగి వస్తానని
చెప్పి వెళ్లిపోయింది కాకి.

–గుండెల్లి ఇస్తారి
9849983874

పిచ్చుక

ఊర పిచ్చుక ఉషోదయానికి
తెల తెల వారందంతో
చెరువుల్లో తాన మాడి
భానునికి అర్ఘమిచ్చి
తరువుపై ఫలాన్ని స్వీకరించి
ఇంటి ముందున్న చెట్టుపై వాలి
కిలకిలమని మంగళ వాద్యాలతో
మానవజాతిని మేలుకొల్పుతావు
నీ కంటు ఆశ్రయం లేక
పూరి గుడిసే దూలమో
పెంకుటింటి దూలమో వెతికి
గూడు నిలుపుకుంటావ్
మడి పంటల్లో విరి తోటల్లో
గల గలమనే సవ్వడితో
వీనుల విందు చేస్తూ
కనిపించే నీవు నేడు కరువవుతున్నావు.

–బీటుకూరి వసంత
సెల్: 9676835302

సర్కారు బడి చదువులమ్మ ఒడి

కథ

అనగనగా ఒక ఊరిలో సర్కారు బడి ఉండేది ఆ బడిలో 100 మంది పిల్లలు ఉండేవారు ఆ బడిలో చాలామంది పిల్లలకు చదవడం రాయడం వస్తుంది కానీ ఒకరోజు పదిమంది పిల్లలని వారి తల్లిదండ్రులు ఈ పాఠశాల నుండి తీసి ప్రైవేట్ పాఠశాలలో చేర్చారు ఆ పాఠశాలలో చేరిన కొన్ని రోజుల తర్వాత ఆ పిల్లలు చదువులో వెనకబడ్డారు ఎందుకంటే సర్కార్ బడిలో పిల్లలకు డిజిటల్ బోర్డు టీవీలను ఉపయోగించి పాఠాలు చెప్పడం వలన వారికి సులభంగా అర్థం అయ్యేవి కానీ ప్రైవేటు బడిలో ఈ విధమైన బోర్డులు లేవు కానీ ప్రభుత్వ పాఠశాలలలో బోధనతో పాటు విద్యార్థులకు ఉచితంగా రెండు జతల యూనిఫామ్ తో పాటు ఉచిత మధ్యాహ్న భోజనాన్ని అందిస్తారు పైసలు కూడా కట్టవలసిన అవసరం లేదు ఈ రకమైన సదుపాయాలు ప్రైవేటు పాఠశాలలో ఉండవు ఇవన్నీ ఆలోచించి ప్రభుత్వ బడి నుంచి ప్రైవేటు బడిలో చేరిన పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్చారు కొన్ని రోజుల తర్వాత మరికొంతమంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలను వీడి సర్కారు బడిలో చేరారు దీనితో సర్కారు బడి విద్యార్థుల సంఖ్య 200 కు చేరింది

నీతి సర్కారు బడులను కాపాడుదాం మెరుగైన విద్యను పొందుదాం

–రచన .విలోహిత్
6వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రేగులపల్లి

దేశఖ్యాతిని ఇనుమడింపచేసిన వివేకానందుడు

వేదికపై మాట్లాడుతున్న తేజావత్ రామ్‌దాస్.చిత్రంలో కసిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు.

స్వామి వివేకానందుడు దేశభక్తిని ఇనుమడింపచేశారని నగర ట్రాఫిక్ పోలీస్ విభాగం అడిషనల్ డిసిపీ తేజావత్ రామ్‌దాస్ అన్నారు. తెలుగు భాషా చైతన్యసమితి, కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయ గానసభలో స్వామి వివేకానంద జయంతి సభ ప్రముఖ కవి, విమర్శకుడు రామకృష్ణ చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తేజావత్‌రామ్‌దాస్ మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలు మానవాళి మనుగడకు ఎంతో దోహదప

ఉపనిషత్తులు

వేదాల తర్వాత ప్రసిద్ధి పొందినవి ఉపనిషత్తులు. ఇవి మంత్రద్రష్టలైన మహర్షుల చేరచింపబడినవి. ఉపనిషత్తులను వేదాంతం అని కూడా అంటారు. వేదాంతం అనగా వేదం యొక్క చివరి భాగం అని అర్థం. దశోపనిషత్తులలో మొదటిదైన ఈ శావాస్యోపనిషత్తు మాత్రమేయు జుర్వేదంలోని చివరిదైన 40వ అధ్యాయం అందఱుకే అది వేదాంతమైంది. మిగిలినవి కూడా వేదాలోని ఏదో ఒక శాఖకు సంబంధించినవే కాబట్టి మరియు వేదసారాన్నే బోధిస్తున్నందు వలన అవికూడా వేదాంతాలనే పిలువబడుతాయి.

ప్రధానంగా పేర్కొనబడుతున్న దశోపనిషత్తుల రచనా కాలం క్రీ.పూ.ఏడవ శతాబ్దిగా బౌద్ధ యుగానికి పూర్వమే అని తెలుస్తున్నది. ఈ పది ఉపనిషత్తులకే శ్రీ శంకరాచార్యులు (క్రీ.శ. 788-820) భాష్యం రాసినారు. అవి 1) ఈశావాస్యోపనిషత్తు 2) కేనోపనిషత్తు 3) కఠోపనిషత్తు 4) ప్రశ్నోపనిషత్తు 5) ముండకోపనిషత్తు 6) మాండూక్యోపనిషత్తు 7) తైత్తిరీయోపనిషత్తు 8) ఐతరేయోపనిషత్తు 9) ఛాందోగ్యోపనిషత్తు 10) బృహదారణ్యకోపనిషత్తు.

మొత్తం ఉపనిషత్తుల సంఖ్య 108. పై దశోపనిషత్తులకే కాకుండా ఆది శంకరాచార్యుల వారు మరో రెండు ఉపనిషత్తులకు కూడా భాష్యం రచించినట్లుగా శ్రీ వావిళ్ల రామస్వామి శాస్త్రులవారి గ్రంథం 'ద్వాదశోపనిషత్తులు'ను బట్టి తెలుస్తున్నది. అవి 1) శ్వేతాశ్వతరోపనిషత్తు 2) నృసింహతాపిన్యుపనిషత్తు.

ఉపనిషతుతష్టుఉ ప్రధానంగా బ్రహ్మ విద్యకు సంబంధించినవి. అవి సత్యాన్ని నిగ్గుతేల్చే చర్చావేదికలుగా భాసిస్తాయి. కేవలం ఆధ్యాత్మిక జీవనానికి ఉపదేశం చేయడమే కాదు, లౌకిక జీవనం సారవంతం కావడానికి ఉ పనిషత్తులు మార్గదర్శనం చేస్తాయి.

ఉపనిషత్తులు అన్నింటికంటే గొప్పదైన బ్రహ్మము. అంటే పరిమాత్మను గురించి తెలియజేయడమే కాకుండా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందజేస్తున్నాయి. నీ గురించి నీవు తెలుసుకోవడమే ఆధ్యాత్మికత. అదే ఆత్మజ్ఞానం. ఆత్మ, శరీరం, ప్రాణం, ఇంద్రియాలు, మనసు గురించి తెలుసుకోవడమే. ఆత్మజ్ఞానం పొందిననాడే బ్రహ్మ జ్ఞానాన్ని పొందగల్గుతాడు. మోక్షమార్గాన్ని అనుసరించగలుగుతాడు.

ఆత్మ, పరమాత్మ, ప్రకృతి తత్త్వాల సృష్టి, స్థితిలయలు, కార్యకారణ సంబంధాల గురించి ఉపనిషత్తులు ఉద్బోధిస్తాయి. కర్మలు, కర్మఫలాలు, జనన మరణాలు, శాశ్వతానందం గురించి తెలియజేస్తాయి.

ఉపనిషత్తులు కేవలం బ్రహ్మవిద్యకు మాత్రమే సంబంధించినవి కావు. ఉపనిషత్తులలో కనిపించే ఋషులు సరళ స్వభావులు, వినయశీలురు, నిరాడంబరులు, జిజ్ఞాసువులు, ఉదారవాదులు, మలముక్షవులు.

ఉపనిషత్తులు నీతి నియమాలు, ఆచార వ్యవహారాలు, త్యాగశీలత, మానవ సంబంధాలు, దుఃఖ నివారణ మార్గాల గురించి తెలియజేస్తూ వ్యక్తి అభివృద్ధికి, వికాసానికి తోడ్పడుతాయి.

కాబట్టి ఇవి అందరూ అధ్యయనం చేయడం శ్రేయస్కరం. మాకు సంబంధించినవి కావు. అనుకోవడానికి వీల్లేదు.

-జక్కని వేంకటరాజం
సెల్: 94400 21734

సాల్యూట్ సైనికా

సైనికా! ఓ సైనికా!
మా కలం గళం మీ వెంటే..!

కన్నులగప్పి కాటేయ జూసే
చొరబాటుదారుల ఎత్తుజిత్తులకు
మీ గన్నులే మాకు వెన్నుదన్నులు...!

కొవ్వెక్కి,మదమెక్కి,
పగబట్టి చొరబడే
ఉగ్ర పంజాలను
ఉక్కుసంకల్పంతో
పరుగులు తీయించే ...
మీ శౌర్యధైర్యాల
రక్తతర్పణ ధార సింహనాదాలై
దేశరక్షణమేమో ధృఢచిత్తభావమై
శతకోట్ల జీవాత్మ శ్రేయమే ధ్యేయమై
విద్యుక్తధర్మమే శిరోధార్యమకుటమై
త్రి కాలాలలో
త్రికరణ శుద్ధిగ
తీక్షణ చూపుతో
మంచు కొండల్లో
నివాసముంటు నిశాచరుల్లా
పరాయి దేశపు తురాయి బుద్ధిని
ఎప్పటి కప్పుడు అంచన వేస్తు
ఫిరంగి ఫాటికి సరింగ నిలబడి
మందుగుండులు మరేవి వచ్చిన
శత్రు మూకను తరిమె ప్రతాపం...!

శతకోటాత్మల బంధుడవు
బలి మూకలకీశుడవు
మా పాలిట కేశవుడవు
భరతజాతికే ప్రణతుడవు..!

నా భారత జవాను
నీవే మాకు దివాను
నీ చేతిలో గన్నున్నది
మా చేతిలో పెన్నున్నది
నీ లక్ష్యం నీ ధ్యేయం
ఉత్తమోత్త కర్తవ్యం
గతి తప్పిన జనాలకు
దేశభక్తి ఏ పాటిదో...?

భరత జాతి ఐక్యతకు
బాద్షావు నీవేనోయ్
దండలోని దారమల్లే
నీ దారే ఆదర్శం..!

జో కొట్టే జవానుడా
జై కొడతాం మేమంతా..!
నిన్ను తలచినంతనే
భావ యుక్తి పైకెగసి
అక్షరాలే అనునయంగ
పుష్పాంజలి ఘటిస్తాయి..!

మీ రక్తం ఏరులైతే
మా రక్తం సిరా చుక్క
ఆత్మార్పణ చేస్తాయి..
పెన్నుగ గర్జిస్తాయి..!

మిన్నొరిగినా,గన్నిరిగినా
మీ వెనుకే మా పెన్నులు
యువరక్తం నింపుకొని
నిటారుగా రొమ్ము విరిచి
కలం కదిలి జవానైత..!

నా గళమే ఓ దళమై
నా కలం త్రివిద దళం
భారతీయ బంధు దళం..!

సైనికుడా! సైరికుడా!
మీ కోసం మా ప్రార్థన !
మా యోచన మీ సలాం
మీ సేవే మా గులాం ...!

కలకాలం కలం బలం
మీ కోసం మేం రాస్తాం...!
గళమంతా మీ పాటే
గీతాంజలి మేమౌతాం...!

హృదినిండా కొలువున్నవు
మదినిండా నీ సేవోయ్!
జై జవాన్..! జై కిసాన్ ..!
జై విజ్ఞాన్ ..! జై భారత్..!

-డా.పాండాల మహేశ్వర్
9912180054

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1374వ రోజు 'ప్రశంస' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'ప్రశంస' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సవ మూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839

మెప్పు

చిట్టితల్లి
రంగుల పెన్సిల్ తో
గీసిన బొమ్మ
ఎంత బాగుందో అంటూ
అమ్మ ప్రశంస
చిన్నారి కళ్ళలో మెరుపు
ముఖంలో ఆనందం.
ఓ చిన్న పొగడ్త
ఉత్సాహానికి ఊపిరి
చైతన్య ప్రేరకం
తర్వాతి గొప్ప పనులకు
ఇచ్చే చేయూత
చిన్నపాటి ప్రశంసలు
జీవనానికి బాటలు!!.
అతి అనర్థదాయకం
అహంకారానికి దారులు
చేస్తారు తర్వాత దాడులు
గొప్పలు తెస్తాయి తిప్పలు
ఏదైనా ఎంతలో ఉండాలో
అంతలో ఉంటేనే మంచిది
ఒక్క ప్రశంస
జీవితానికి మలుపు సాధనం!.

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

ప్రతిభ

పనిలో ప్రతిభ ఇచ్చిన వెలుగు
ప్రతిభే పూల వర్షంతో మునుగు.
కనిపించేది ఎదుటివారి నిస్వార్థం
పెంచేది హృదయ గౌరవం.
పలుకులలో పెరిగే శ్రేయస్సు
పెంచుతుంది మనిషి తేజస్సు.
పొగడ్తల పరిమళమే జీవిత స్ఫూర్తి
అయినా
ఓ ప్రశంసే కడుపు నింపదు పూర్తి
నీ విజయగాథలే తాకుతాయి
పర్వత శిఖరాలు
ప్రశంసలే
జీవితపు సువాసనలు.
నీ ప్రతి ప్రయత్నం
ప్రశంసలకి పునాది
ఓ మంచికి అదే అవగలదు నాంది.
మన నమ్మకానికి నిలిచే నీడలుగా
వెలుగునిస్తాయి మరో కార్యానికి
దీపంలా.
ఆత్మవిశ్వాసానికి అద్దం
మనదైన శైలికి విలువ.
పొందాలి ఆహ్లాదపరిచే ప్రశంసలు
గడపాలి రమ్యమైన తరుణాలు.

-డా.రమ్యా స్వరూప్

మాటల మంత్రాయుధం

ప్రశంస ఎవరికైనా ముద్దే
అభిశంసన అందరికీ చేదే!
రాని పనిలో రాణించేలా చేయగలదు
కాని కార్యాన్ని
సాధించేలా ప్రోత్సహించగలదు
సుతిమెత్తని మాటల మంత్రాయుధం
ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే
ఇంద్రజాలం!
ప్రేమికులకు మొదటి
పూబాణం పొగడ్తయే
ఆలుమగల బంధ బలోపేతంలో
ప్రాధాన్యత దానిదే
దేవతలైనా మురిసి
ఇస్తారు వరాలు ముఖస్తుతితో
పసివారైనా
చెప్పిన మాట వింటారు ప్రశంసావ్యాఖ్యతో!
పదిమందిలో ప్రకటించే ప్రశంసావాక్యం
పది ఏనుగుల బలం
ఆత్మన్యూనతకు తొలగింపు!
ప్రశంసతో వెన్ను తడితే
అవుతారు పిల్లలు
చదువులో ప్రథములు
నైపుణ్యాన్ని గమనించి
భుజం తడితే
యువత మార్చుకోగలరు
తమ తప్పుడు పథాలు!!.

-చంద్రకళ దీకొండ

ప్రశంసలే మెట్లు

ఎవరైనా
ఏదైనా రంగంలో
ప్రత్యేకత సాధిస్తే
చేసే అభినందన
అందించే ప్రశంస
ఎదుగుదలకు దోహదం
పిల్లలు బాగా చదవడానికి
ఉద్యోగులు కష్టపడి పనిచేయడానికి
వంటలు ఇంకా రుచిగా వండడానికి
కేర్ టేకర్స్ కు కృతజ్ఞత తెలపడానికి
ఆటల పోటీల్లో నెగ్గినవారికి
పై స్థాయి పోటీల్లో
విజేతలవడానికి ఒక మంత్రం
పర్యావరణానికి కృషి చేసే
ప్రకృతి ప్రేమికులకు
కష్టాల్లో ఉన్న పేదవారికి
వికలాంగులకు
అనాథలకు
వంటరి మహిళలకు సేవచేసేవారికి
మనవంతు సహాయం చేయగలిగినా
కనీసం ప్రశంసించగలిగినా
మన బాధ్యతలో కొంత నెరవేర్చినట్లు
ప్రశంసలు మనిషికి టానిక్కులు
ప్రశంసించడం మన బాధ్యత అయితే
ప్రశంసలను మెట్లుగా
మార్చుకొని పైకెదగడం
విజేతల బాధ్యత.

-నాగిరెడ్డి అరుణజ్యోతి

ప్రశంస ఒక టానిక్

ఒక ప్రశంస
మనలో ఉత్సాహానికి
ఊపిరూలూదుతుంది
చేసిన కష్టాన్ని మరిపిస్తుంది!!.
ఎదుటి మనిషిని
స్వప్రయోజనానికి
పొగిడితే
నా అంతవారు లేరని
విర్రవీగే జనాలు
బలుపు కాదు వాపు అని
తెలియని అమాయకులు!!.
పొగడ్తలకు పొంగిపోయి
అందలం ఎక్కి కూచుని
దిగి రానని
మొరాయించే మూర్ఖులు!!.
ఒక సత్ప్రశంస
బంధాలను బలపరుస్తుంది
కవుల కలాలకు
పదును పెడుతుంది!!
స్తుతి ఎన్నడూ
కారాదు సుత్తి
పొగడ్త కారాదు అగడ్త
ప్రశంస
ఆత్మవిశ్వాసానికి హేతువు
ప్రోత్సాహానికి ఒక టానిక్
అతి పొగడ్త
అధోగతికి దారితీసే
నిప్పుల పంతెన
పొగడ్తలకు పొంగక
విమర్శలకు కృంగక
చూపాలి స్థితప్రజ్ఞత!!
ప్రశంస కావాలి
జీవితానికి రాచబాట
అదే మన జీవితానికి
వెలుగుబాట!!

-పరిమి వెంకట సత్యమూర్తి

టానిక్

ప్రశంస టానిక్కు
ఇస్తుంది కిక్కు
నిరాశ నిస్పృహ పోగొట్టి
ఉత్సాహం ఉల్లాసంతో
ఆలోచనలను గిలకొట్టు
చిట్టిపాపాయి మొదలు
పండు తాత దాకా
చిన్న నవ్వు పలకరింపుకు
ఆనందంతో కేరింతలు
బుగ్గమీద
అమ్మ పెట్టే ముద్దుకి
బుడిబుడి నడకలతో
చిట్టిచేతుల సాయం
'శభాష్' అన్న నాన్నల మాట తో
ఏనుగెక్కినంత సంబరం
తాకుతుంది అంబరం.
దానవుల స్తోత్రాలకు
పొంగే ఉబ్బులింగడు
వరాలిచ్చి చిక్కుల్లో
"లేవయ్య హనుమా" అని
వానరుల జాంబవంతుని మాటలకు
కదిలె సీతాన్వేషణకై
"స్తుతిమతి" అని
అల్లసాని అల్లిక జిగిబిగిని
ప్రశంసించి
తొడిగాడు రాయలు గండపెండేరం
పృథ్వీరాజ్ చౌహాన్
వీరశౌర్య
బలపరాక్రమాల వర్ణనతో
చాంద్ బరదాయీ
చారణకవిగా
హిందీసాహిత్యంలో మెరుపులు
భట్రాజులు
పందిమాగధుల పొగడ్తలతో
రాజులకు చిత్తశాంతి
సకారాత్మక ఆలోచనలు
ఊహల్తో
ప్రజారంజక పాలన.
చిట్టి ఉడుత
బుడత సాయానికి
రాముడు వీపు నిమిరిన చందం
విద్యార్థుల చిన్న చేతల రాతలకి
అధ్యాపకులు వీపు నిమిరి
భుజం తడితే
వెయ్యి ఏనుగుల బలం
"శభాష్"
ముల్లోకాలను
జయించే శక్తి మంత్రం .

-ఎ.రాజ్యశ్రీ

పూలజల్లు

శరత్కాల శశికిరణ
శీతలత్వం ఒకింత
కలిగిన ప్రశంస
కలిగిస్తుంది పులకింత.
"ప్రియా! నీ కురులు
గులాబీ రేకులకు
నేర్పిస్తున్నాయి మెత్తదనం"
ఎంత సున్నిత ప్రశంస.
సున్నితంగా సూక్ష్మంగా
ఉన్న ప్రశంస పొందగలిగితే
జీవితాంతం మనతో ఉంటుంది.
ప్రశంసలో అతిశయోక్తులు
ఆడంబర పదప్రయోగాలు
ఎక్కువ అయితే
ప్రశంస విలువ
పడుతుంది పక్కదారి.
ఎదుటివారి ప్రత్యేకతను
కళాత్మకంగా
హృదయాహ్లాదపూర్వకంగా
చెప్పడం ప్రశంస
ఉన్నవాటికి
మరిన్ని
ఉన్నవి లేనివి
కలిపి చెప్పేవి పొగడ్తలు
రాజులకు బట్రాజులు
నేటి రాజకీయనాయకులకు
ప్రక్క వాద్యగాళ్ళు వీళ్ళే
పొగిడే బృందం.
పొగడ్తలు ముంచుతాయి కొంపలు
ప్రశంసలు
మనిషిని మరో మెట్టు ఎక్కిస్తాయి.
గొప్ప కార్య సాధకుల సామర్థ్యం
తెలిపే పద్ధతే ప్రశంస
కార్య'బాధ'కులను స్టేజీపై కూర్చోబెట్టి
మైకు పగిలేట్లు చెప్పేవి పొగడ్తలు.

-డా.సి.వసుంధర

అభినందన

ప్రతిభకు లభించే ప్రోత్సాహం
మంచి పనికి దక్కే అభినందన
చేసిన సాయానికి పొందే ప్రశంస
ఆప్యాయతకు దొరికే పొగడ్త
అపురూపం, అమూల్యం.
ఒక చిన్న అభినందన
వేయి మంచి పనులకు బీజం
ఒక చక్కని ప్రోత్సాహపు మాట
లక్ష సాయాలకి వేస్తుంది బాట.
గురువు చేత పొందే ప్రశంస
చదువుపై పెంచుతుంది ఆశ
బాసు చేత పొందే అభినందనం
పదోన్నతికి దారి చూపే శ్వాస.
ఒక చిన్న ప్రశంస
పొగడ్త, స్తుతి
ఎంతటి వాడికైనా కలిగిస్తుంది తృప్తి
మితి మీరిన ప్రశంస
అహానికి తెర
పాతాళానికి దారి.
అభినందిస్తుంటే తరచు సహాయకులని
మరింత ఉత్సాహంతో చేసి పెడతారు
పనిని
పదవికి భయపడి చేసే స్తుతి
నోటి నుండి పుట్టుకొస్తుంది
పదవి పోగానే మాయమై పోతుంది
వ్యక్తిత్వాన్ని మెచ్చి ఇచ్చే స్తుతి
హృదిలో నుండి పుట్టుకొస్తుంది
కలకాలం ఎదలో కొలువై ఉంటుంది
ధనంతో పనిలేనిదే ప్రశంస
మనసును గెలిచేదే ప్రశంస.
ప్రతిభను ప్రశంసిస్తే పోయేదేముంది
ఓ ప్రశంస
మనపై ప్రేమను పెంచుతుంది.

-జె.వి.కుమార్ చేపూరి

పొగడ్త

సకల చరాచర లోకంలో
ప్రశంస ఒక భూషణం
పొగడ్త ఎక్కిస్తుంది ములగ చెట్టు
మురిపెంతో.
మంచితో
మమతతో
బువ్వ తినిపించే అమ్మ
నా బుజ్జి తండ్రి
బంగారు తండ్రి అంటూ
ప్రశంసలు, ముద్దులు
ప్రశంస
విలువున్న విజ్ఞతతో
మహామహులను పొగడడం
తప్పు కాదు!
సన్మానించవచ్చు
సగౌరవంగా
పదిమందిలో.
గౌరవించడం మాననీయం
సంస్కారయుత
సంప్రదాయ
గౌరవాల అర్హుల వ్యక్తులకు
సన్మానాలు
ప్రశంసలు
పారితోషికాలు
సమంజసం
ఆవశ్యకం.

-కె.కె.తాయారు

తన్మయానందం

ప్రశంస వింటూ ఉంటే
తన్మయానందమే కదా!
ప్రశంసలోని
మనోహర పుష్పాలభావన
హృదయంలో సోకగానే
పరవశించే ఆనందవు
వెన్నెలసోన.
మనసులోని స్పందన
మల్లెల పందిరి గుబా ళింపు
మనసు ఆనంద జలకాలలో
తేలియాడడమవుతుంది.
ప్రశంసే
ఉన్నత శిఖరాలకు వారధి
ఏ పనినైనా సాధించగల
స్ఫూర్తి కారకం
ఉత్సాహాన్ని ఇచ్చి
కలిగిస్తుంది జయం
ఆత్మవిశ్వాసం
కొలువుదీరుతుంది మదిలో
మన ప్రాచీన సంప్రదాయం
రాజులు ప్రశంసలకు
రత్నాలు
వరహాలు
సంపత్తిని ఇచ్చేవారు
దేవతలు
ప్రశంసలకు వరాలు ఇచ్చేవారు
ఉబ్బులింగడు వరాలిచ్చి
ఆపదలను కొనితెచ్చుకునేవాడు
వివాహబంధంలోనూ
ప్రేమికుల
అనురాగ సరాగాలలోనూ
ప్రశంసలకే కదా ప్రాధాన్యత
ప్రశంస రోగనివారిణి
జీవన ఔషధం.

-ఆర్.రమాదేవి

గాంధేయవాది విశ్వసాహితీ అధినేత డా॥ పోతుకూచి 97వ జయంతి వేడుకలు

'పోతుకూచి' శతజయంతి వేడుకలను ప్రభుత్వమే నిర్వహించాలి- వక్తల డిమాండ్

తెలుగు నేలపై తొలి ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించిన తొలితరం సాహితీవేత్త, సాహితీభీష్మాచార్యులు, విశ్వసాహితీ సంస్థ వ్యవస్థాపకులు, శ్రీ కృష్ణభగవానుని ఆరాధకుడు గాంధేయవాది డా॥ పోతుకూచి సాంబశివరావు 97వ జయంతి వేడుకలు అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్కృతి కేంద్రంలో ఆత్మీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవయిత్రి, రచయిత్రి గాయని శ్రీమతి హైమవతి భీమన్నను డా॥ పోతుకూచి స్మారక తొలి విశిష్ట పురస్కారంతో సత్కరించారు. పోతుకూచితో బోయిభీమన్న అనుబంధాన్ని ఆమె వివరించారు. ముఖ్య అతిథి ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య డా॥ గంగిశెట్టి లక్ష్మీ నారాయణ మాట్లాడుతు 60 యేళ్ళ క్రితం పోతుకూచి సాంబశివరావు సాహిత్య సేవను ప్రారంభించి ఎంతో మంది కవులను ప్రోత్సహించారని కొనియాడారు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ డా॥ టి. గౌరీశంకర్ మాట్లాడుతు పోతుకూచి సాహితీవైభవాన్ని వివరించారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు, తంగిరాల చక్రవర్తి, గోళ్లమూడి పద్మావతి, ఎబీబీఎస్ఎస్ అధ్యక్షులు ఆచార్య కదారు సత్యమూర్తి, పోతు కూచితో తమకున్న అనుబంధాన్ని వివరించారు. వారి సాహిత్య కృషిని అభినందించారు.

ఈసందర్భంగా డా॥ పోతుకూచి సాంబశివరావు స్మారక పురస్కారాల గ్రహితలు బి. రామచంద్రరావు, కె.బి.యన్.శర్మ, ఆచార్య కె. సత్యమూర్తి, బొబ్బిలి మల్లారెడ్డి, కె.రామ్మోహన్‌రావు, ఎన్. గోపాల కృష్ణ, శ్రీమతి ఆకెళ్ళ సుబ్బలక్ష్మి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, జయసూర్య, పులిగడ్డ విజయలక్ష్మి, పంకజామల్లిక్, పులివర్తి కృష్ణమూర్తి, కూర చిదంబరం తదితరులను సత్కరించారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులకు సత్కరించారు. అనంతరం చౌదూరి నరసింహారావు, రచించిన "నవకవి రత్నాలు" పుస్తకాన్ని ముఖ్య అతిథి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు.

గాంధేయవాది పోతుకూచి శతజయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని, సాహితీవేత్తలు అంతా కలిసి ఆయన శతజయంతి వేడుకలను ప్రపంచ తెలుగు మహాసభలుగా నిర్వహించుకోవాలని వక్తలు సూచించారు. పద్మ పురస్కారాలను అందుకున్న ఇరు రాష్ట్రాల కవులు, కళాకారులను సాహితీవేత్తలు ఈ సందర్భంగా అభినందించారు.

కవయిత్రి, రచయిత్రి, గాయని శ్రీమతి హైమవతి భీమన్నను డా॥ పోతుకూచి స్మారక తొలి విశిష్ట పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

చౌదూరి నరసింహారావు, రచించిన "నవకవి రత్నాలు" పుస్తకావిష్కరణలో అతిథులు.

కథలు బాలబాలికల మనోవికాసానికి దోహదపడతాయి - డా.అమృతలత జీవన సాఫల్య పురస్కార గ్రహీత దాస్యం సేనాధిపతి

కథలు బాలబాలికలలో నైతిక విలువలు పెంపొందించడంతోపాటు వారి మనోవికాసానికి దోహదపడతాయని డాక్టర్ అమృతలత జీవన సాఫల్య పురస్కార గ్రహీత ప్రముఖ కవి దాస్యం సేనాధిపతి అన్నారు.

జనవరి 28, మంగళవారం రోజున కరీంనగర్ లోని ఆర్విన్ ట్రీ హైస్కూల్లో భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన పుస్తకావిష్కరణ సభలో ముఖ్య అతిథిగా హాజరై వైరాగ్యం ప్రభాకర్ ప్రచురించిన బాల కథా కదంబం సంకలనాన్ని ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలు బాలల్లో చిన్ననాటి నుండి మంచి అలవాట్లను పెంపొందించడానికి ఉపయోగపడతాయని ,బాలబాలికల్లో వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని అన్నారు. ఉత్తమ పౌరులుగా తమ జీవితాలను తీర్చిదిద్దుకోవడానికి సహకరిస్తాయని, తోటి వారితో ఎలా ప్రవర్తించాలో, మానవ సంబంధా లను ఎలా నిలుపుకోవాలో కథల ద్వారా గ్రహించవచ్చని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ విద్యావేత్త భగవతి మరియు ఆర్విన్ ట్రీ పాఠశాలల చైర్మన్ బి. రమణా రావు మాట్లాడుతూ విద్యార్థులు సమీక్షలు చేయడం ద్వారా ఏది మంచి ఏది చెడు గ్రహిస్తారని, అంతేగాక పుస్తక పఠనం అలవడు తుందని, తద్వారా భాషా నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని, జీవితంలో ఎదురయ్యే సంఘటనలను సమీక్షిం చుకుని ఉత్తమ జీవితాన్ని పొందగల రని అన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రముఖ బాలసాహితీవేత్త రచయిత గరిపెల్లి అశోక్ మాట్లాడు తూ పిల్లలకు తెలియని విషయమం టూ ఏదీ లేదని అవకాశం కల్పిస్తే వారు సాధించలేనిదంటూ ఏదీ లేదని అన్నారు.

కేవలం మనం చేయాల్సింది వారికి ప్రోత్సాహాన్ని అందించడమేనని అన్నారు.

ఆత్మీయ అతిథిగా హాజరైన ప్రముఖ కవి గంప ఉమాపతి మాట్లాడుతూ నేటి బాలలు చదువులోనే కాదు సంగీతం , సాహిత్యం, చిత్రలేఖనం తదితర రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు.బాల కథా కదంబంలోని ముప్పై కథలను ముప్పై మంది విద్యార్థినీ విద్యార్థులు చక్కని సమీక్షలు చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు.

భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ద్వారా పిల్లల చేత సాహితీ సభలో సమీక్షలు చేయించి కొత్తదనానికి నాంది పలికిన వైరాగ్యం ప్రభాకర్ ను,చక్కని సమీక్షలు చేసిన విద్యార్థులను ఈ సందర్భంగా పలువురు కవులు అభినంది ంచారు.వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాడిశెట్టి గోపాల్ ,అన్నాడి గజేందర్ రెడ్డి, యోగాచార్య నంవత్ కుమార్ ,నగునూరి రాజన్న,జనగాని యుగంధర్ రెడ్డి,సిరిపురం వాణిశ్రీ, కసిరెడ్డి జలంధర్ రెడ్డి ,ఆర్విన్ ట్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ నిబృంది పాల్గొన్నారు.

ఆహ్వానము
రావి రంగారావు సాహిత్యపీఠం గుంటూరు
2025 ఫిబ్రవరి 7 శుక్రవారం సా. 6 గం. కు
అన్నమయ్య కళా వేదిక, బృందావన్ గార్డెన్స్
శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం, గుంటూరు
స్వాగతం : డా. రావి అరుణ, డైరెక్టర్, రావి రంగారావు సాహిత్య పీఠం
జ్యోతి ప్రకాశం : శ్రీ చిటిపోతు మస్తానయ్య , అధ్యక్షులు, దేవాలయ పాలక మండలి
సభాధ్యక్షులు : శ్రీ గద్దె మంగయ్య , కార్యదర్శి, ఆర్ వి ఆర్ ఆర్ విద్యా కళాశాల
ముఖ్య అతిథి : శ్రీ గోనుగుంట్ల కోటేశ్వరరావు, అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్
విశిష్ట అతిథి : డా. తరపట్ల సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం, రాజమండ్రి
పురస్కార కార్యక్రమ నిర్వహణ : డా. మైలవరపు లలిత కుమారి
జన రంజక కవి ప్రతిభా పురస్కార గ్రహీతలు
శ్రీమతి గుమ్మా నాగ మంజరి : "పుష్ప మంజలి" (పద్యాలు)
శ్రీ ప్రకాష్ నాయుడు : నొన్న ఎందుకో వెనకబడ్డాడు (వచన కవితలు)
శ్రీ రాజేశ్వరరావు లేదాళ్ళ : అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి (వచన కవితలు)
శ్రీరత్నాజీ నేలపూరి : గాలి లేని జాగా
వందన సమర్పణ : శ్రీ గడల శివ ప్రసాద్
రావి రంగారావు సాహిత్య పీఠం (రి. నం. 6/2016),

జాంపండ్లు ..

(కథానిక..)

బడికి సమయమౌతుందనీ వడివడిగా బండిని నడుపుతున్నాను.నేను వెళ్తున్న దారిలో పండ్లబండ్లు చాలా ఉంటాయి.నా బండికి నా లంచుబాక్సు బ్యాగుతో పాటు ఒక పెద్ద ఖాళీబ్యాగూ వేలాడుతూ ఉంటుంది. మా ఉపాధ్యాయ మిత్రబృందం దాని మీద జోకులూ వేస్తుంటారు. ఎపుడూ ఏవో పండ్లో ,కూరగాయలో అందులో ఉంటాయనీ. నిజమే.. వెళ్ళేటపుడు ఇంటికీ ఆ బ్యాగెపుడూ ఖాళీగా వెళ్ళదు. పండ్లో,వస్తువులో, కూరగాయలో ఏవో ఉంటాయి. మా పిల్లలు చిన్నగా ఉన్నప్పటి నుండీ నాకిదే అలవాటు.

ఐతే బడికి వచ్చేటపుడు కూడా పండ్లు చాలా సార్లు కొని తెస్తుంటాను. దానికి రెండు కారణాలు ఒకటి ఎప్పటికప్పుడూ తాజా పండ్లను నేను తినడంతో పాటు మా ఉపాధ్యాయిలాలకూ కొంతైనా తినిపించాలనీ, రెండవదీ మా ప్రభుత్వ బడిలో చదువుకుంటున్న పిల్లలు పొద్దున ఏమీ తినకుండా వస్తారు. ఎవరైన ఆకలనీ, వస్తే నా దగ్గర ఉన్న పండ్లనిస్తాను. ఈ విషయం పిల్లలందరికీ తెలుసు. అందుకే ఇంటర్వెల్ సమయంలో నా దగ్గర పిల్లలు మూగి ఉంటారు. మా సార్లు నన్ను పిల్లలకోడీ అంటుంటారు సరదాగ. కానీ వాళ్ళకూ నా బ్యాగు మీద ఆశ ఉంటుంది. ఏం పండ్లున్నాయో అనీ.. ముఖ్యంగా సీజనల్ పండ్లు వచ్చినప్పుడల్లా తొలిపండ్లు నేనే తెచ్చి తినిపిస్తుంటాను. అది వారికీ అలవాటు. నాకో ఆనందం!

ఇక ఈరోజుకు వస్తే.., హడావుడి వెళ్తునే చుట్టూ చూస్తున్నా. పండ్ల కోసం. ఒకచోట జాంపండ్ల బండి కన్పించింది. ఒక పెద్దాయన అరవై పైనే వయసుంటదేమో తోసుకుంటూ వస్తున్నడు. నేను పండ్లతో పాటు అమ్మేవారినీ గమనించి కొంటుంటాను. దాదాపు పెద్దవయసు వారి దగ్గరే కొంటాను. ఇంకా వాళ్ళు పనిచేస్తున్నారంటే వాళ్ళ మీద గౌరవం కలగడం వల్ల! యువకులు ఎంత లేటయినా అమ్ముకొని పోతారు. వీళ్ళవి తొందరగా అమ్ముడుపోతే ఇంటికెళ్ళి విశ్రాంతి తీసుకుంటారని నాకు అన్పిస్తూ ఉంటుంది. అందుకే అక్కడె నా బండిని ఆపాను. అతనూ రండి సార్ తాజా జాంపండ్లు ఎంత జోకామంటరన్నాడు. బేరమాడకుండానే రెండు కిలోలు జోకమన్నాను. ఇలాంటి వృద్ధుల దగ్గర బేరమాడవద్దనేది నా మరో సిద్ధాంతం.

అతను తక్కెట్లో పండ్లు వేస్తున్నపుడే, పక్కనే ఒక బడి ఉన్నట్లున్నది అక్కడి నుండి పిల్లలందరూ సామూహికంగా పాడుతున్న "జనగణమన.."జాతీయగీతం వస్తున్నది. వెంటనే తక్కెడ పక్కన పెట్టి అతను అటెన్షన్ గా నిలబడ్డాడు. నేనూ బండి దిగి నిలబడ్డాను. మైకులో వస్తున్న ఆ గీతానికి అతను గొంతు బిగ్గరగా కలిపి పాడుతున్నాడు. ఆశ్చర్యంగా స్పష్టంగా , ఒక్క తప్పులేకుండా చక్కగా పాడాడు. పూర్తి కాగానే సెల్యూట్ కూడా పెట్టాడు.

నేనడిగాను 'ఏం చదువుకున్నావనీ, – ఏపుడో సార్ యాభయేండ్ల కింద ఐదు .. ఉపుడు రోజూ పాడేటోళ్ళం సార్ ! అని సిగ్గుపడుతూ చెప్పాడు. లేదు చాలా బాగా పాడినవ్ . తప్పులు లేకుండా చక్కగా పాడినారు.సంతోషమనిపిస్తున్నదీ. ఎట్లా గుర్తున్నది ఈ గీతం మొత్తం అని ఉక్కుకతతో అడిగాను. సార్ చిన్నప్పుడు.. ఏం తక్లీబ్ లు లేకుండ సదువుకున్నయి మంచిగ యాదికుంటయి కదా , సర్! అన్నాడు. నాకు ఆ మాటలు గొప్పగా అన్పించినాయి. మీ పేరు అని అడిగా.. మహ్మద్ హమీద్ .. సార్.. అన్నారు. సలాం చెప్పి పండ్లు తీసుకొని బండి ఎక్కాను.

– డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

మహాత్ముడి విలక్షణ జీవితం – ప్రపంచ మానవాళికే దారి దీపం

20వ శతాబ్దపు ప్రపంచ మేటి ఘనుల్లో ప్రముఖమైన మహాశక్తిగా నేటికీ నిలుస్తున్నారు మన మహాత్మా గాంధి. భారతీయులకే కాకుండా నెల్సన్ మండేలా, లూథర్ కింగ్ జూనియర్ లాంటి అనేక విశ్వ విఖ్యాత నాయకులకు సహితం ప్రేరణగా నిలిచిన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ జీవితం నేటికీ మానవాళికి దారి దీపంగా నిలుస్తున్నది. భారతీయ లాయర్, రాజకీయ నాయకులు, భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు, సామాజిక కార్యకర్త, సాహితీవేత్త, అతి సాధారణ జీవనశైలిని పరిచయం చేసిన మహా నేత అయిన గాంధీ అహింస అనే పదునైన ఆయుధాన్ని ప్రయోగించి బ్రిటీష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించి భరతమాతకు స్వేచ్ఛను ప్రదానం చేశారు. భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించిందనే సంతోషంతో పాటు దేశ విభజన గాయాలనతో బాధ పడుతున్న వేళ 30 జనవరి 1948న హిందుత్వవాది నాథురామ్ వినాయక్ గాడ్సె తూటాలకు తుది శ్వాస విడిచారు.

అమర వీరుల దినోత్సవం:

మహాత్మాగాంధీ వర్ధంతి 30 జనవరి రోజున దేశవ్యాప్తంగా "అమర వీరుల దినం (మార్టిర్స్ డే)" లేదా "గాంధీ పుణ్య తిథి" లేదా "షహీద్ దివస్"గా పాటించడం ఆనవాయితీగా మారింది. గాంధీ పట్ల అభిమానంతో రవీంద్రనాథ్ టాగూర్ తొలిసారి "మహాత్మా" అని పిలవడంతో వారి పేరు మహాత్మాగాంధీ అని, "జాతి పిత"అని, ప్రేమతో "బాపు" అని నోరారా పిలుచుకునే గాంధీ జీవితం భరతమాత సేవకు అర్పించారు. అహింస, ఏకత, మానవీయత లాంటి సమోన్నత విలువలను మానవాళికి పరిచయం చేసిన అసమాన మానవతీ మూర్తి మన బాపు. గుజరాత్ రాష్ట్ర పోర్బందర్ పట్టణంలో 02 అక్టోబర్ 1869న జన్మించిన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ లండన్‌లో బారిస్టర్ పట్టాను పొంది 21 ఏండ్ల పాటు దక్షిణ ఆఫ్రికాలో గడిపారు. అక్కడ నెలకొన్న జాతి వివక్ష, అసమానతలను చూసిన చలించారు.

స్వాతంత్ర్య ఉద్యమ రూపశిల్పి: దక్షిణ ఆఫ్రికా నుంచి 1915లో భారత్‌కు తిరిగి వచ్చి భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ ఆ ఉద్యమ స్వరూపాన్ని ఆసాంతం మార్చి వేసి బ్రిటీష్ తెల్ల దొరల గుండెల్లో ధడ పుట్టించారు. అహింస అనే అత్యంత పదునైన ఆయుధాన్ని ప్రయోగించి ఉద్యమాన్ని కొనసాగిస్తూనే, వలస పాలకులతో చర్చలు జరుపుతూ, చివరకు బ్రిటీష్ పాలనకు అంతం చూపగలిగారు. సత్యం, అహింస, క్షమాగుణం, నిస్వార్థ సేవ, సానుకూల భావనలు, మానసిక దృఢత్వం, త్యాగం, సత్యాగ్రహాలను పునాదులుగా చేసుకొని ఉద్యమాగ్నికి ఆజ్యం పోశారు. తన జీవిత చరిత్రను "మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రుథ్" అనే ఆత్మకథను రాసి భవిష్యత్తు తరాలకు సన్మార్గం చూపుతున్నారు. విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వినియోగం, ఖాళీ ఉద్యమం, సహాయనిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా, దండం మార్చ్ లాంటి అనేక రకాలైన ఉద్యమాలను నడిపి స్వాతంత్ర్యం తెచ్చి పెట్టారు

క్రమశిక్షణ, శాంతి, సమానత్వం, నైతికత, మానవీయ విలువలను శాశ్వత ఆభరణాలు ధరించి జీవితాన్ని కొనసాగించిన గాంధీ మనకు నిత్య ప్రేరణగా నిలుస్తున్నారు. వారి ఆదర్శాల తరంగాలు భారత్‌లో మాత్రమే కాకుండా ప్రపంచమంతటా వ్యాపించడం వాస్తవం, అనుసరణీయం. మానవీయ విలువ నిలువెత్తు రూపం మహాత్మాగాంధీ. చొక్కా దొడగడం వదిలి విలువల వస్త్రాలను ధరించి సాదాసీదా జీవితాన్ని మహోన్నతంగా గడిపిన గాంధీ ఐన్‌స్టీన్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త చేత మహోన్నతుడిగా కొనియాడబడడం హర్షదాయకం, ఆశ్చర్యకరం. గాంధీ చూపిన బాటలో నడుస్తూ, సిద్ధించిన స్వతంత్రాన్ని నిలుపుకుంటూ, విలువల పాటించి వ్యక్తిగతంగా ఎదుగుతూ, దేశాభివృద్ధికి సహకరిద్దాం, భారతమాతా కీ జై అంటూ నినదిద్దాం.

(30 జనవరి "అమర వీరుల దినోత్సవం" సందర్భంగా)

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై కళానిలయం సంస్థ నిర్వహణలో సోమవారం ఫణి భార్గవ్ జయంతి వేడుకలలో పాల్గొన్న కురుగంటి కళాక్షేత్రం నృత్య గురువు శ్రీమతి రాధిక, శ్రీ సాయి నటరాజ అకాడమీ నృత్య గురువు శ్రీమతి తులసి శిష్య బృందంలతో సీనియర్ జర్నలిస్టులు బైస దేవదాసు, కె. రామచంద్రమూర్తి, మరియు ఎం.కె.రాము, యస్. వినయ్‌కుమార్, కె. సురేందర్

తోటలో ఉరివేసుకొని ఆత్మహత్య..

అమరావతి, జనవరి 29:బుక్కరాయసముద్రం మండలంలోని దయ్యాలకుంటపల్లి గ్రామ పరిధిలోని నరసమ్మ గుడి సమీపంలో ఉన్న తోటలో లక్ష్మీపతి రెడ్డి(45) వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మృతుడు కళ్యాణ్ దుర్గం ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆయన ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సింది.

ఫిబ్రవరి 9న మధుశ్రీ కథా గౌరవ సభ

నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, వాడ్రేవు వీరలక్ష్మీ దేవి, కాళ్ళకూరి శైలజకు కథా గౌరవ సత్కారం

మధునాపంతుల వేంకటేశ్వర్లు (మధుశ్రీ) కథా గౌరవ సభ ఫిబ్రవరి 9వతేదీ ఆదివారం ఉదయం గం.10.00 పల్లిపాలెం గ్రామం నిర్వహిస్తున్నట్లు మధునాపంతుల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ మధునాపంతుల తెలియజేశారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలంలోని పల్లిపాలెంలోని మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణంలో ఏటా జరుపుతున్న కథా గౌరవ సభలో కథా రచనలో విశేష కృషి చేసిన సాహితీవేత్తలకు తమ తండ్రి, కథకుడు మధుశ్రీ పేరిట ఏర్పాటు చేసిన కథా గౌరవ సత్కారాన్ని చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ ఏడాది ప్రముఖ రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడు (తిరుపతి), ప్రఖ్యాత రచయిత్రి డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీ దేవి (విజయవాడ), ప్రఖ్యాత రచయిత్రి డాక్టర్ కాళ్ళకూరి శైలజ కథా గౌరవ పురస్కారాలను ఈ సమావేశంలో స్వీకరిం చనున్నారని నిర్వాహకులు చెప్పారు. ఆంధ్రీ కుటీరం సంచాలకుడు మధునాపంతుల సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఫౌండేషన్ కార్యదర్శి ఎం.వి. చలవతి స్వాగతం పలుకుతారు. పురస్కార స్వీకర్తల పరిచయ కర్తలుగా బీకేఎన్ రాజా (హైదరాబాద్), వసుంధారాణి (విజయవాడ), డాక్టరు కె.రామచంద్రారెడ్డి (హైదరాబాద్) వ్యవహరిస్తారు. సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. వివరాలకు 9704186544 నంబరుకు సంప్రదించవచ్చు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.

ఆ బడి బయట కూర్చొని అక్షరం దిద్దిన వాడే ఇప్పుడు దేశానికి మకుటం అయ్యాడు

–డా॥ కత్తి పద్మారావు
9849741695

ఆకాశం నుండి పూల వర్షం
అశోకుని మూడు సింహాల మీద కురిసింది
ధర్మచక్రం బ్యాండు మేళాల
మధ్య ఊరేగించబడుతుంది
నిర్మించిన వాడు లోయలలో నుంచి
ఆకాశంలో నక్షత్రం అయ్యాడు
జీవన వైవిధ్యం రంగు రంగుల వలయాలుగా
విస్తరిస్తుంది
సెల్యూట్‌ను స్వీకరించే మూలవాసిని
ఓ విద్యుద్దీపం
త్రిదళాల సైనిక కవాతుల్లో
భారతం మెరుస్తుంది
విమాన విన్యాసాలతో ఆకాశం హోరెత్తింది
బౌద్ధ శకటం "ధర్మం శరణం
గచ్ఛామి" అని బోధిస్తుంది
ఆంధ్రుల ఏటకొప్పాక కొయ్య బొమ్మలు
దృశ్య విన్యాసం చేస్తున్నాయి
నారీ సైన్యం కవాతుల్లో
పునరుత్సాహ ప్రభంజనం
ప్రతి అడుగులో ఆత్మస్థైర్యం
వెల్లివిరుస్తుంది
మరోప్రక్క స్త్రీల అత్యాచారాల పెను కేకలతో
దద్దరిల్లుతున్న భారతం
నిరక్షరాస్యులు మౌఢ్య తిమిరాల్లో
కునారిల్లుతున్న జఢత్వం
వైరుధ్యం తీవ్రమౌతూ వెళుతుంది
మురికి పాలవుతున్న జలనిధులు
త్రాగునీరు, దొరకని దాహర్తి
ఆ 'కాంతార' నిన్నటి వరకు గొప్ప నటి
ఇపుడు బలవంతంగా
త్రివేణి సంగంలో ముంచారు
ఆమెను 'మహామాత' చేశారు
మంత్రోచ్చారణ మధ్య
సజీవ సహగమనాన్ని ఆచరింపచేశారు
సన్యాసులు, యోగులు, దేశంలో పెరుగుతున్నారు
శ్రమజీవుల సంపదను దోచుకుంటున్నారు
కొండల్ని, మైదానాల్ని, నదులను
దురాక్రమణ చేస్తున్నారు
సనాతన దురాగతం పెరుగుతుంది
మతోన్మాద శంఖాలు పూరిస్తున్నారు
జ్ఞానాన్ని, వివేకాన్ని ఎదుర్కొనే
దౌష్ట్యం వారిది
రాజ్యాంగాన్ని నిరాకరిస్తూ, నిందిస్తూ జీవిస్తున్నారు
"గ్రంథాలు చదవక్కర్లేదు
రెండు చేతులతో పని చేయక్కర్లేదు'
రెండు చేతులకు రెండు భజన చెక్కలుంటే చాలు
రెండు అక్షరాలు నామవాచకం వస్తే చాలు
జీవికను వెళ్ళదీయవచ్చు" అని బోధిస్తున్నారు
నీటిని కల్మషం చేయడంతో వారు ఆగడం లేదు
బుద్ధిని కల్మషం చేస్తున్నారు
లక్షల కరాలతో భజనలు చేస్తున్నారు
కోట్ల గొంతులతో నినాదాలు చేస్తున్నారు
ప్రశ్నకు మరణశిక్ష,
మాట్లాడే మాటలకు సంకెళ్ళ
బ్రాహ్మణ్యం విస్తరిస్తుంది
పౌరోహిత్యం పురులు విప్పుతుంది.
స్త్రీల జీవన సంస్కృతులపై గొడ్డలి వేటు
అంతర్గతంగా
విస్తరిస్తున్న అస్పృశ్య భారతం
అయినా!
ఆ చూపుడు వేలు కదలి
తరంగాలలో చొరబడి చైతన్య
స్రవంతుల్ని పొంగిస్తుంది
కోటి సూర్యుళ్ళను సృష్టించి
భూమి పైకి ప్రసరింపచేస్తుంది
నిజమే! ఇది మరో స్వతంత్ర పోరాటం
నిరాకరించబడిన సమూహాలు మేల్కొంటున్నాయి
విల్లంబుల ములుకుల్లో నుంచి అక్షర ద్యుతి
ఆ చెరువు ఆనాడు ఎండిపోయి ఉంది
ఒక్కొక్క నీటి చుక్క పడింది
చెరువు నిండింది
అందులో చందమామ అద్దం చూసుకుంది
కలువ భామలు పులకరించాయి
చేపలు గుంపులు గుంపులుగా
ఈత వేస్తున్నాయి
ఆ తల్లి ఆ చెరువుకు ఆనాడు
ఆ కడవతో వెళ్ళింది
కూతురు ఈనాడు బిందెతో వచ్చింది
కూతురు ముఖం వికసించింది
పరిణామాన్ని ఎవరు ఆపగలరు?
అక్షరాలు దిద్దటమే కాదు
జీవితాన్ని తీర్చిదిద్దుకోవడం ఒక స్ఫూర్తి
కొత్త భాష వినిపించినప్పుడల్లా
ఒక అనుభూతి
భాషలు ఎల్లలు దాటుతున్నాయి
యాభైఆరు అక్షరాలు వచ్చిన వారికి
ఇరవై ఆరు అక్షరాలు రావడం సులభమేగా!
రంగవల్లులు దిద్దడమే కాదు
రాజ్యాలు పాలిస్తున్నారు
అవును! వారు కవయిత్రులు అవుతున్నారు
అప్పుడు వారు వారి భావాలను
కాలి మునివేలుతో దిద్దారు
ఇప్పుడు వారు అక్షర శిల్పాలు చెక్కుతున్నారు
వారు బయటకు కనిపించే
దానికంటే అంతరంగంలోనే
లోతుగా ఉన్నారు
వారిని ఎవరూ అందుకోలేక పోతున్నారు
వారు ప్రతి ఊనికనూ, ఊసునూ
లిఖిస్తున్నారు.
దృశ్య చిత్రాలు గీయగలుగుతున్నారు
జీవన మాధుర్యాన్ని రుచి చూస్తున్నారు
ఆలోచనల్లో అవగాహనల్లో స్మృతి పయనాల్లో
వంతెనలు నిర్మిస్తున్నారు
ప్రపంచాన్ని తమ ముందు నిలబెడుతున్నారు
ప్రపంచం వారినే కాదు
వారి లిపి సౌందర్యాన్ని దర్శిస్తూ ఉంది
భాష పెదాల మీద కంటే
వేళ్ళ కొసల్లో మెరుస్తూ ఉంది
అది గానంతో శృతిబద్ధం అవుతూ ఉన్నది
నిజాయితీ, అభివ్యక్తి వీరి జ్ఞాన స్రవంతికి
జీవాన్ని పోస్తున్నాయి
నిజమే! ఆ కాలువ గట్టుపై పిల్లి పెసర్ల రుచి
ఆ కొత్తిమీర తోటలో ఒక్కొక్క ఆకు
పంటితో కొరుకుతున్నప్పుడు ఉండే ఆనందం
ఆ పనస కాయ స్వీయంగా వొలిచి
ఒక్కొక్క 'తొన' తింటున్నప్పుడు ఉండే రుచి
ఆ మొక్కజొన్న కండె నిప్పుల మీద కాల్చి
ఒక్కొక్క విత్తనం ముని పంటితో వొల్చి
తింటున్నప్పుడు ఉండే అనుభూతి
సహజమైనవి కదా!
వారు ఈ ప్రకృతిని ఎంత విధ్వంసం చేసినా
ఈ సృజనకర్తలు రక్షక భటులుగానే ఉన్నారు
నిశ్శబ్దంలోనే ప్రత్యామ్నాయాలు
సృష్టి అవుతున్నాయి
ఆ ఉపాధ్యాయిని నల్లబోర్డుపై గీసిన గీత
ఆ విద్యార్థుల మెదడుల్లో
దేశపటం అవుతూ ఉంది
ఆమె అభివ్యక్తిలోని శైలీ విన్యాసానికి
వారు ప్రపంచ మానవులవుతున్నారు
ఆమె నిర్మించిన అక్షర విమానాలపై
వీరు దేశాంతరాలు ప్రయాణిస్తున్నారు
నిజమే! కొన్ని సున్నితమైన మాటలే
వారి వ్యక్తిత్వ నిర్మాణానికి బాటలు అవుతున్నాయి
ఈనాడు మూడు సైనిక శ్రేణుల వందనాన్ని
అందుకుంది కూడా ఆ ఉపాధ్యాయినే
నిజానికి! ప్రతి మనిషిలోనూ
సైనికులు దాగి ఉన్నారు
నిర్భయులదే విజయపతాక
ఆ బడి బయట కూర్చొని
అక్షరం దిద్దినవాడే ఇప్పుడు
దేశానికి మకుటం అయ్యాడు
ఈ రిపబ్లిక్ సృష్టికర్త ఆయనే
ఆయన మార్గంలో నడుద్దాం!

పుణ్య క్షేత్రానికి వెళ్తూ.. పరలోకానికి..

కరీంనగర్, జనవరి 29: పుణ్య క్షేత్రానికి వెళ్తున్న ఆ కుటుంబాన్ని మృత్యువు వెంటాడింది. కాళేశ్వరం దర్శనం కోసం బయల్దేరిన వారిలో దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్న విషాద ఘటన వివరాలిలా ఉన్నాయి.. సిద్దిపేట నుంచి కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి కారులో బయలుదేరిన వారు సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి చేరుకోగానే కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయి అందులో ప్రయాణిస్తున్న సిద్దిపేటకు చెందిన ఆకుల కనకయ్య, తార అనే దంపతులు అక్కడికక్కడే మృతిచెందారు.

తప్పుడు వార్తలు రాస్తే ఊరుకోం-ఎమ్మెల్యే గుమ్మనూరు



అమరావతి, జనవరి 29:తనపై కొందరు మీడియా ప్రతినిధులు తప్పుడు ఆరోపణలు చేస్తూ వార్తలు రాస్తున్నారని మాజీ మంత్రి, గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మండిపడ్డారు. నిరూపించే దమ్ము ఉంటేనే వార్తలు రాయాలని నిరూపించలేకపోతే రైలు పట్టాలపై పడుకోబెడతానని హెచ్చరించారు. ఎవడో డబ్బులు ఇస్తాడని తప్పుడు వార్తలు రాస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిం చారు.

తాను భూకబ్జాలకు పాల్పడ్డానని, నియోజకవర్గంలో తన కుటుంబ పెత్తనం ఉందంటూ కొందరు తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని వారంతా పద్ధతి మార్చుకోవాలని అన్నారు. గుంతకల్లు పట్టణ శివారులోని దోనిముక్కలలో జయరాం పర్యటించారు. అక్కడ ఉన్న లేఔట్ లో గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యల గురించి ఆయన ఆరా తీశారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్న వారిపై ఆయన నిప్పులు చెరిగారు. డబ్బులకు ఆశపడి తప్పుడు వార్తలు రాయొద్దని హెచ్చరించారు.

కవి సిద్ధార్థ కవిత్వం తెలంగాణ అస్థిత్వాన్ని ప్రతిబింబిస్తుది

ప్రముఖ కవి సిద్ధార్థ కవిత్వం తెలంగాణ అస్థిత్వాన్ని ప్రతిబింబిస్తుందని సీనియర్ జర్నలిస్ట్ కె.శ్రీనివాస్ అన్నారు. సోమవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జమిలి సాహిత్య సాంస్కృతిక, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కవి సిద్ధార్థ సాహిత్య సమాలోచన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కవి సిద్ధార్థ ప్రతి కవితలో తాత్విక ధోరణితొ నింపుతూనే అవసరాన్ని బట్టి ధిక్కార స్వరాన్ని వినిపిస్తాడని అన్నారు. తన చుట్టూ ఉన్న మనుషులు వారితో ఉన్న అనుబంధాలను అక్షరూపంలో పెడతాడని కొనియాడారు. సిద్ధార్థ పదాల్లో నేలతనం ఉట్టిపడుతుందని పేర్కొన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ప్రపంచీకరణ తొలిదశ నుంచి నేటి వరకు తెలంగాణలో వచ్చిన వస్తున్న మార్పులను, అస్థిత్వవాదాలను తన కవిత్వంలో చూపించడం గొప్ప విషయమన్నారు. ఆయన కవిత్వానికి లక్ష్మణ్ ఏలేబొమ్మలు మరింత వన్నె తెచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీనియర్ జర్నలిస్టు బుచ్చన్న, యువకవి ఆదిత్య, అంబటి సురేంద్ర, అక్షరకుమార్ తదితరులు పాల్గొన్నారు. చివరగా స్పందిస్తూ కవి సిద్ధార్థ మాట్లాడుతూ తన కవిత్వం గురించి గొప్ప సభ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కవిత్వం నా కులవృత్తి నేను రాయడం మానను అంటూ ఉపన్యసించారు.

సాహిత్యం, సామాజిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

అంతా రామమయం

ఆదర్శాలతో అగ్రభాగమున
ఆసీనులైన రామాడు ,
నమ్మినవారికి దేవుడై
కలియుగమందు కలలు తీర్చే
కరుణామయుడై
పూజలందుకుంటున్నాడు.
ఆపదలో ఉన్నవారికి
అండగా తానుండి
ఆశకు కవచముతాన్నై
ఆశయాన్ని పూర్తిచేసే అభయమిస్తు
ఆధునిక కాలంలో అయోధ్యాపురమున
పున:దర్శనమిచ్చాడు.
యుగాలు గడచినా
యుగపురుషుని నామస్మరణ
నేటికి నలువైపుల వినిపిస్తుంది
అశాంతిలో ఉన్నవారికి
శాంతి మంత్రమై రక్షణ ఇస్తున్నది.
మంచి చేసి రాముడు
జనం గుండెల్లో చోట పొందినాడు
సోదర భావనతో మెలిగే
ఐక్యతా శక్తిని పెంచి
అమృతం లాంటి
దివ్య ఔషదమందించాడు.
రామనామం అణువనువున
వ్యాపించి
నేడది అయోధ్యా నగరంలోని
సరయూనది తీరంలో
బాల రాముని రూపంలో వెలసి
జగతినేలే జగదభిరాముడై
పున:దర్శనమిచ్చాడు.

–డా.బి.సుధాకర్
సిద్దిపేట

అంతా రామమయం

అంతా రామమయం...
చూపులకదిగిన ప్రతి రేఖలో,
చెవులకు వినిపించే ప్రతి నాదంలో,
నిత్యం నన్ను చుట్టుముట్టే ఈ జగత్లో..
అంతా రామమయం!.
చందమామ వెలుగులో,
నదుల పులకింతలో,
వనమాలిక సౌరభంలో,
పక్షుల గానం తీయదనంలో...
అంతా రామమయం!.
బాలుని చిరునవ్వులో,
మాతృ ప్రేమ పొంగులో,
సజీవ హృదయ స్పందనలో,
సత్యధర్మ మార్గదర్శనలో...
అంతా రామమయం!
రాముని నామమే జీవన గీతం,
అతనిదే ఆశ్రయం, అతనిదే మార్గం,
హృదయంలో నిండిన భక్తిరసంతో,
ప్రతి పుటలో రామ కథే గానం.
రామ! నీ లీలలు అపారమై,
ప్రపంచమంతా నీ పరిమళమై,
ప్రేమ, శాంతి, భక్తి రూపమై,
ఎల్లప్పుడూ అంతా రామమయమే!.

–రజనీ కులకర్ణి
భాగ్యనగర్ చార్మినార్

యుగపురుషుడు –శ్రీ రాముడు

అయోధ్యా పురవాసుడు
కౌసల్యా దశరథ తనయుడు
లోకోద్ధారణకై ఇలలో జన్మించిన వాడు
త్రేతా యుగపురుషుడీ శ్రీ రామ చంద్రుడు.
సర్వాంగ సుందర మూర్తి శ్రీ రాముడు
ధర్మం పోతపోస్తే కలిగే రూప మతడు
ఆదర్శాలకు ప్రతి రూపమతడు
కష్టాల కడలిని ఈదిన వాడు
ఆనందాలకు నిలయమైన
అనంత రాముడు.
మంత్రముగ్ధ మనోహరుడు
సకల గుణ ధాముడు
శిధనస్సును పట పట విరిచినవాడు
జానకిని పెళ్లాడి సీతారాముడిగా నిలిచాడు.
తండ్రిమాట జవదాటని ఉత్తముడు
జనకుని మాటకై రాజ్యమొదులుకున్నోడు
హనుమ గుండెలో కొలువైనవాడు
రామనామం పలికిన
జీవితాలధన్యం చేసినవాడు
సుగ్రీవుడునకు ప్రియ మిత్రుడైనాడు
రాతిని నాతిగచేసి శబరికి
మోక్షమునిచ్చినవాడు.
నీలిమేఘ శ్యాముడైన కోదండ
రాముడు
నరుడే నారాయణుడైన తారక
రాముడు
జగదభి రాముడై
జగతినేలినవాడు
జన్మభూమి స్వర్గంకన్నా
మిన్నయని చాటాడు.
శ్రీరాముడి చరిత
నయనానందకరం
రామావతారం జాతి ప్రజలు
చేసుకున్నపుణ్యం
ఎందరికో మోక్షాన్నొసగిన
అవతారం
అందుకే అంతారామమయం
జగమంతారామమయం.

–మండికారి బాలాజీ

అవతార పురుషుడు

లోక కళ్యాణం కోసం
త్రేతా యుగం లో
కౌసల్య,దశరధా
తనయుడు గా
వెలసిన అవతార మూర్తి
శ్రీ రామచంద్రుడు.
ఒకటే బాణం, ఒకటే మాట
ఒకటే సతి గా కీర్తి గాంచిన
పితృ వాక్ పరిపాలన లో
దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం
వెలసిన